## మనూర్ మండలంలో గెలిచిన సర్పంచ్‌లు వీరే

### కాంగ్రెస్ 17.. బిఆర్ఎస్ 5 మంది విజయం

**మనూర్, డిసెంబరు 17, ప్రభాతవార్త:** మండలంలోని 22 గ్రామ పంచాయతీలకు బుధవారం జరిగిన మూడవ విడత ఎన్నికల్లో ఆయా పార్టీల మద్దతుతో బరిలో నిలిచిన అభ్యర్థులకు ప్రజలు తమ సర్పంచులుగా ఎన్నుకున్నారు. ఎన్నికైన సర్పంచ్‌ల వివరాలు ఇలా ఉన్నాయి... మండల పరిధిలోని దోసపల్లిలో బి.దత్తు(కాంగ్రెస్), కమలాపూర్ రమేష్(కాంగ్రెస్), ముగ్దంపూర్‌లో మోహన్‌రెడ్డి(కాంగ్రెస్), బెల్లాపూర్‌లో దిగంబర్‌రెడ్డి(కాంగ్రెస్), బాదల్‌గావ్‌లో మమత(కాంగ్రెస్), తిమ్మాపూర్‌లో కస్తూరిబాయి (కాంగ్రెస్),ఉసిరికపల్లిలో రుక్కమ్మ(కాంగ్రెస్), ఎన్‌జి హుక్రానాలో సరిత(కాంగ్రెస్), తుమ్నూర్‌లో సంజీవ్ (కాంగ్రెస్), మనూర్‌లో రమ్య(కాంగ్రెస్), తోర్నల్‌లో సంగమేశ్వరర్(కాంగ్రెస్), అతిమ్యాలలో విద్యాసాగర్ రెడ్డి (కాంగ్రెస్), ఎల్గోయిలో శివాజీరావు(కాంగ్రెస్), డోవూర్‌లో నరసమ్మ(కాంగ్రెస్), దుదగొండలో చంద్రలీల(కాంగ్రెస్), బోరంచలో బీరయ్య(కాంగ్రెస్) శేలిగిరిలో శ్రీశైలం(కాంగ్రెస్), ధన్వార్‌లో (బిఆర్ఎస్), పులుకుర్తిలో తుకారం(బిఆర్ఎస్), రాయిపల్లిలో సల్మాబేగం(బిఆర్ఎస్), రానాపూర్‌లో సంగారెడ్డి (బిఆర్ఎస్), మాయికోడ్‌లో కరణం కృష్ణ (బిఆర్ఎస్)లను ఓటర్లు తమ గ్రామ సర్పంచ్‌లుగా ఎన్నుకున్నారు.



మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట

వార్త

## జహీరాబాద్ కమిషనర్‌గా సత్య ప్రణవ్

**జహీరాబాద్, డిసెంబరు 17, ప్రభాతవార్త:** జహీరాబాద్ మున్సిపల్ కమిషనర్‌గా కే సత్య ప్రణవ్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతల స్వీకరణకు కార్యాలయానికి చేరుకున్న సత్య ప్రణవ్‌ను మున్సిపల్ కార్యాలయ సిబ్బంది ఘనంగా స్వాగతం పలికారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం భర్తీ చేసిన గ్రూప్-1లో అర్హత సాధించి జహీరాబాద్ మున్సిపల్ కమిషనర్‌గా విధులో చేపట్టారు. ఇంత వరకు కమిషనర్‌గా విధులు నిర్వహించిన డి సుభాష్‌రావు అనారోగ్యంతో దీర్ఘకాలక సెలవులో ఉండటంతో సత్య ప్రణవ్‌ను కమిషనర్‌గా ప్రభుత్వం నియమించింది.



బాధ్యతలు స్వీకరిసుతన్న సత్య ప్రణవ్



పోలింగ్‌తీరును పరిశీలిస్తున్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హైమావతి

### ఎన్నికల నిర్వహణకు కృషిచేసిన

## అధికారులకు, ప్రజలకు అభినందనలు

### జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హైమావతి

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:** జిల్లాలో బుధవారం నిర్వహించిన మూడో విడత గ్రామ పంచాయతీల పోలింగ్‌తీరును జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె.హైమావతి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కోహెడ మండల పరిధిలోని శనిగరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, తంగళ్లపల్లి జడ్పీ స్కూల్, బస్వాపూర్ జడ్పీ, మండల పరిషత్ పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలలో ఓటింగ్ సరళిని పరిశీలించారు. అలాగే కొండపాక మండలం మర్పడ, సిర్సనగడ్ల, కొండపాక, దుద్దెడ గ్రామాల్లోని జడ్పీ, ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను ఆమె పరిశీలించారు. జిల్లాలోని మూడో విడతలో 150 గ్రామ పంచాయతీలు, 1182 వార్డులకు ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్ నిర్వహించగా ఓటర్లు ప్రశాంత వాతావరణంలో తమ ఓటుహక్కును వినియోగించుకున్నారని తెలిపారు. ఎలక్షన్ మోడల్ కోడ్ ఉల్లంఘన కింద 350కిపైగా కేసులు నమోదు చేసినట్లు వివరించారు. ఎన్నికల నిర్వహణకు కృషి చేసిన అధికారులకు, ప్రజలకు ప్రతి ఒక్కరికి ఆమె అభినందనలు తెలిపారు.

## మంత్రిని కలిసిన ఇటిక్యాల సర్పంచ్

### -నాలుగుసార్లు ఓడి ఐదవసారి సర్పంచ్‌గా విజయం



మంత్రి దామోదర్ రాజనర్సింహాను కలిసిన ఇటిక్యాల సర్పంచ్

**పుల్‌కల్, డిసెంబరు 17, ప్రభాతవార్త:** పట్టువదలని విక్రమార్కుడిలా ప్రజాప్రతినిధిగా ఎన్నికయ్యేందుకు ఐదుసార్లు పోటీపడి చివరకు సర్పంచ్‌గా ఎన్నికై తన చిరకాల వాంచను మండల పరిధిలోని ఎస్ ఇటిక్యాలకు చెందిన డాకూరి స్వప్నసురేందర్‌రెడ్డి నెరవేర్చుకున్నారు. గ్రామానికి చెందిన డాకూరి స్వప్న సురేందర్‌రెడ్డి (భార్య,భర్త)లు 1995, 2006, 2013, 2019లో సర్పంచ్‌గా పోటీచేసి అపజయం పాలయ్యారు. 4 మార్లు సర్పంచ్‌గా పోటీచేసి ఓటమిపాలైనా పట్టువదలని విక్రమార్కుడిలా మరోమారు ఈ నెల 14న జరిగిన రెండవ విడత పంచాయతీ ఎన్నికల్లో పోటీచేసి భారీ మెజార్టీతో సర్పంచ్ గద్దెనెక్కారు. పంచాయతీలో జరిగిన ఎన్నికల్లో గ్రామంలో 1276 ఓట్లు ఉండగా 1068 ఓట్లు పోలయ్యాయి. కాంగ్రెస్ మద్దతుతో పోటీచేసిన స్వప్న సురేందర్‌గౌడ్‌ను 812 మంది ఓటర్లు మద్దతు ప్రకటించగా బిఆర్ఎస్ మద్దతులో పోటీచేసిన కమ్మరి మౌనికకు 231 ఓట్లు పోలవడంతో 581 ఓట్ల మెజార్టీతో స్వప్న సురేందర్‌గౌడ్ సర్పంచ్ కుర్చీని కైవశం చేసుకున్నారు. సర్పంచ్‌గా ఎన్నికై ప్రజాసేవ చేయాలనుకున్న స్వప్నసురేందర్‌గౌడ్ కలనెరవేరడంతో గ్రామంలో ఇదే విషయాన్ని చర్చించుకుంటున్నారు. సర్పంచ్‌గా విజయం సాధించిన స్వప్న సురేందర్‌గౌడ్ వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహాను కలుసకుని శాలువాతో సత్కరించి పూలబొకేను అందచేయగా మంత్రి సర్పంచ్ దంపతులను అభినందించి ఆశీర్వదించారు.

## చిలిప్‌చెడ్ మండలంలో గెలిచిన సర్పంచ్ అభ్యర్థులు

**చిలప్‌చెడ్, డిసెంబరు 17 ప్రభాతవార్త :** మండలంలో 19 గ్రామ పంచాయతీలు గెలుపొందిన అభ్యర్థులు సంబురాలు చేసుకున్నారు. 1. అజ్జమర్రి బ్యాగరియశోద(కాంగ్రెస్), 2. అంతారం పంబాల భాగ్యలక్ష్మి(బిఆర్ఎస్), 3.బద్రియతండా రమావత్‌కున్యా (బిఆర్ఎస్), 4. బండపో తగల్ వీరన్నగారి లక్ష్మీ(కాంగ్రెస్), 5. చండూర్ శేషాద్రి(కాంగ్రెస్), 6. చిలప్‌చెడ్ జూల అనిల్(బిఆర్ఎస్), 7.చిట్కుల్ తుపాకి రాములు (కాంగ్రెస్), 8.ఫైజాబాద్ తళ్ళ రాములు(బిఆర్ఎస్), 9. గంగారం సుదీర్ రెడ్డి(కాంగ్రెస్), 10.గన్యతాండ గుగ్లోత్ నీల (బిఆర్ఎస్), 11.గౌతాపూర్ బల్వంత్‌రెడ్డి(బిఆర్ఎస్), 12. గుజిరి తాండ రమావత్ సుజాత (స్వతంత్ర అభ్యర్థి), 13. జగ్గంపేట్ జనమోల్ల స్రవంతి(బిఆర్ఎస్), 14. రహీ్నగూడ తాండ ఆనంద్(ఏకగ్రీవం) కాంగ్రెస్, 15. రాందాస్‌గూడ వర్ల గౌరి (ఏకగ్రీ వం) కాంగ్రెస్, 16. స్నామ్లాతండా కోల లావణ్య(బిఆర్ఎస్), 17. శిలాం పల్లి ఎల్లయ్యగారి రాజేందర్‌రెడ్డి (కాంగ్రెస్), 18. సోమక్కపేట్ బెస్త దుర్గచలం(కాంగ్రెస్), 19. టోప్యా తాండ రాత్ల దార్య(బిఆర్ఎస్) అభ్యర్థులు గెలుపొందారు.

## వరికొయ్యలను కాల్చవద్దు.. భూమిలోనే కలియదున్నాలి

### -జిల్లా వ్యవసాయాధికారి స్వరూపరాణి

**జగదేవ్‌పూర్, డిసెంబరు 17 (ప్రభాతవార్త):** రైతులు వరి కొయ్యలను కాల్చవద్దని వాటిని భూమిలోనే కలియదున్నాలని సిద్దిపేట జిల్లా వ్యవసాయాధికారి స్వరూపరాణి అన్నారు. జగదేవ్‌పూర్ మండలం దౌలాపూర్ గ్రామంలో రైతులు వరి కొయ్యలను కాల్చుతున్న పొలాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వరి కొయ్యలను కాల్చడం వల్ల పర్యావరణ కాలుష్యం పెరుగుతుందని, విపరీతమైన వేడితో భూమి సారం కోల్పోతుందని, పంట దిగుబడి తగ్గుతుందన్నారు. పంటలకు అవసరమయ్యే పోషకాలు దెబ్బతింటాయని, పంటకు మేలు చేసే సూక్ష్మ జీవులు వరి కొయ్యలను కాల్చడం వల్ల చనిపోతాయని, దీనివల్ల ప్రకృతి సమతుల్యత దెబ్బతిని పంట దిగుబడులు తగ్గుతాయని చెప్పారు.

**వరి కొయ్యలను భూమిలో కలియదున్నితే ఎన్నో ప్రయోజనాలు...**

వరి కొయ్యలు భూమిలో కలియదున్నడం వల్ల సేంద్రీయ కర్బన శాతం పెరిగి 5 నుంచి 10 శాతం దిగుబడులు పెరిగే అవకాశం ఉందని, దుక్కి దున్నే సమయంలో ఒక్క బ్యాగు సింగిల్ సూపర్ పాస్పేట్ చల్లితే అవశేషాలు రెండు వారాల్లో ముగిగి పోషకాలుగా అందుబాటులోకి వస్తాయని, దీని ఫలితంగా డిఏపి ఎరువుల వాడకం సగం వరకు తగ్గుతుందని, ఎకరాకు దాదాపు టన్ను ఎరువు తయారవుతుందన్నారు. మొక్కలకు 2 శాతం నత్రజని, 4 శాతం పార్వరస్ అదనంగా అందుతుందని వివరించారు. ఏ రైతు కూడా వరి కొయ్యలను కాల్చకుండా భూమిలోనే కలియదున్నాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి వసంతరావు, ఏఈవోలు భానుప్రకాష్, రైతులు బాగిరెడ్డి పాల్గొన్నారు.

## ఎన్నికల నిర్వహణకు సహకరించిన ప్రతిఒక్కరికి ధన్యవాదాలు

### జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రావీణ్య



**సంగారెడ్డిమున్సిపాలిటీ, డిసెంబర్ 17, ప్రభాతవార్త** సంగారెడ్డి జిల్లాలో నిర్వహించిన గ్రామ పంచాయతీ ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించడానికి సహకరించిన ప్రతి ఒక్కరికి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.ప్రావీణ్య ధన్యవాదాలు తెలిపారు. ఎన్నికల నిర్వహణలో భాగంగా అంకితభావంతో పనిచేసిన రిటర్నింగ్ అధికారులు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు, పోలింగ్ అధికారులు, ఇతర ఎన్నికల సిబ్బంది, పోలీస్, రవాణా, విద్యుత్ శాఖ, వైద్య ఆరోగ్యశాఖతోపాటు ఇతర సంబంధిత శాఖల అధికారుల సహకారం అభినందనీయమన్నారు. అలాగే ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేలా సహకరించిన అభ్యర్థులు, మీడియా ప్రతినిధులకు శాంతియుతంగా ఓటుహక్కు వినియోగించుకున్న ఓటర్లకు కలెక్టర్ కృతజ్ఞతలు తెలిపారు. ప్రజాస్వామ్య పండుగగా నిలిచిన గ్రామ పంచాయతీ ఎన్నికలను విజయవంతంగా పూర్తిచేయడంలో అందరి సహకారం కీలకమైందని కలెక్టర్ పేర్కొన్నారు.

**పోలింగ్ శాతం 87.43**

**సంగారెడ్డి మున్సిపాలిటీ డిసెంబర్ 17, ప్రభాతవార్త** జిల్లాలో మూడవవిడత గ్రామ పంచాయతీ ఎన్నికలలో 87.43 శాతం పోలింగ్ నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. మూడవ విడతగా కల్హేర్, కంగ్టి, మనూర్, నాగల్‌గిద్ద, నారాయణ్‌ఖేడ్, నిజాంపేట్, న్యాల్‌కల్, సిర్గపూర్ మండలాల్లో బుధవారం పోలింగ్ జరిగింది. ఈ ఎనిమిది మండలాల్లో కలిపి మొత్తం 2,25,483 మంది ఓటర్లు ఉండగా, వీరిలో 1,97, 134 మంది ఓటుహక్కును వినియోగించుకున్నారు. దీంతో మొత్తం 87.43 శాతం పోలింగ్ నమోదైంది. మండలాల వారీగా పోలింగ్ వివరాలు :1) కల్హేర్ మండలం, మొత్తం ఓటర్లు: 16,823 ఓటేసినవారు 14,814, పోలింగ్ శాతం: 88.06 2) కంగ్టి మండలం: మొత్తం ఓటర్లు: 34,992 ఓటేసినవారు: 30,153, పోలింగ్ శాతం: 86.17 3) మనూర్ మండలం: మొత్తం ఓటర్లు: 25,038 ఓటేసిన వారు: 22,372, పోలింగ్ శాతం: 89.35 4) నాగల్‌గిద్ద మండలం: మొత్తంఓటర్లు: 23,924 ఓటేసినవారు: 21,012, పోలింగ్ శాతం:87.83. 5) నారాయణ్ ఖేడ్ మండలం, మొత్తం ఓటర్లు: 39,503 ఓటేసినవారు. 34,591 పోలింగ్ శాతం: 87.57 6) నిజాంపేట్ మండలం, మొత్తం ఓటర్లు: 16,181 ఓటేసినవారు: 14,388, పోలింగ్ శాతం: 88.92 7) న్యాల్‌కల్ మండలం, మొత్తం ఓటర్లు: 47,040 ఓటేసినవారు: 40,452, పోలింగ్‌శాతం: 85.99 8) సిర్గాపూర్ మండలం, మొత్తం ఓటర్లు: 21,982 ఓటేసినవారు: 19,352,పోలింగ్‌శాతం: 88.04

## ప్రశాంతంగా ముగిసిన మూడో విడత పంచాయతి ఎన్నికలు

**హుస్నాబాద్ రూరల్, డిసెంబరు 17, ప్రభాతవార్త** రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన మూడో విడత పంచాయతీ ఎన్నికలు హుస్నాబాద్ నియోజకవర్గంలో ప్రశాంతంగా ముగిసాయి. అయితే ఉదయం 7 గంటలకు ప్రారంభమైన పోలింగ్ మధ్యాహ్నం ఒంటి గంటకు పూర్తయింది. హుస్నాబాద్, అక్కన్నపేట, కోహెడ మండలాల్లో మొత్తం 71 గ్రామపంచాయతీలలో ఎన్నికలు నిర్వహించారు. ఈమేరకు అధికార యంత్రాంగం తగు ఏర్పాట్లు చేసింది. ఓటర్లు ఉదయం నుంచే పోలింగ్ కేంద్రాలకు తరలివెల్లి ఓటు హక్కును వినియోగించుకున్నారు.ఎన్నికలను అభ్యర్థులు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. ఏ విధంగా అయినా గెలుపే లక్ష్యంగా పనిచేసుకుంటూ ఇతర ప్రాంతాలలో ఉన్న ఓటర్లకు బస్సు చార్జీలతోపాటు కొంతసొమ్మును చెల్లించి ప్రత్యేక వాహనాల ద్వారా తరలించారు.

ఉదయం 7 గంటల నుండి మధ్యా హ్నం 1 వరకు పోలింగ్ సాగింది. ఒంటి గంట వరకు వరుసలో నిలుచున్నవారికి అధికారులు ఓటు వేసే అవకాశం కల్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఎన్నికలలో హుస్నాబాద్ మండల వ్యాప్తంగా 87.63, అక్కన్నపేట మండల వ్యాప్తంగా 86.11, కోహెడ 87.65 పోలింగ్ శాతం నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. కాగా మొదటి, రెండవ విడతల మాదిరిగానే మూడో విడత ఎన్నికల్లోనూ అధికార పార్టీకి బిఆర్ఎప్ పోటీ ఇచ్చింది. అయినా అధికార పార్టీకి చెందిన అభ్యర్థులే ఎక్కువగా సర్పంచ్ బరిలో గెలిచారు.



కోహెడలో ఓటుహక్కు వినియోగించుకున్న మహిళలు



అందుడు రాజుతో ఓటు వేయించిన కానిస్టేబుల్

**అందుడితో ఓటు వేయించిన కానిస్టేబుల్...**

మూడవ విడత పంచాయతీ ఎన్నికల్లో భాగంగా హుస్నాబాద్ సర్కిల్ పరిధిలోని కోహెడ మండలం సముద్రాల గ్రామంలో అందుడైన ఉప్పరపల్లి రాజు ఓటుహక్కు వినియోగించుకునేందుకు రాగా గమనించిన కోహెడ ఎస్ఐ పుల్ల అభిలాష్‌తో పాటు కానిస్టేబుల్ రమేష్‌నాయక్ దగ్గరుండి తీసుకుని వెళ్లి ఓటు వేయించారు.



నాగల్‌గిద్దలో ఓటు వేసేందుకు వస్తున్న 102 ఏళ్ల వృద్ధురాలు

## మండలంలో ఎన్నికైన సర్పంచ్‌లు

**నాగల్‌గిద్ద, డిసెంబరు 17, ప్రభాతవార్త:** మండలంలోని ఆయా గ్రామ పంచాయతీలకు బుధవారం జరిగిన 3వ విడత ఎన్నికల్లో ఓటర్లు తమ గ్రామ సర్పంచ్‌లను, వార్డు సభ్యులను ఎన్నుకున్నారు. మండలంలో ఆయా పంచాయితీలకు ఎన్నికైన సర్పంచ్‌ల వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని కరస్‌గుత్తి పంచాయతీకి కవితా నారాయణ జాదవ్(కాంగ్రెస్), ఏనక్‌పల్లిలో మేత్రి ఏశప్ప(కాంగ్రెస్), ఔదాత్‌పూర్‌లో అంబాజి సంతోష్ (కాంగ్రెస్), గూడుర్‌లో జగన్నాథ్(కాంగ్రెస్), గౌడ్గా జన్వాడలో శోభావతి (కాంగ్రెస్), శాపూర్‌లో పాటిల్ జయశ్రీ (కాంగ్రెస్), ఎర్రబొగడలో రాజిబాయి పాటిల్ (కాంగ్రెస్), శాంతినగర్‌లో సవులిబాయి(కాంగ్రెస్), మావినెల్లిలో టెకుర్ బసమ్మ(కాంగ్రెస్), ఈరక్‌పల్లిలో శాంతప్ప(కాంగ్రెస్), శ్యామతాండలో మారుతి జాదవ్(కాంగ్రెస్), కుబాతాండలో రాజురాథోడ్(కాంగ్రెస్), గోప్యనాయక్ తండాలో సంతోష్(కాంగ్రెస్), పూసల్‌పాడ్‌లో హన్మంత్‌రావు(కాంగ్రెస్), దామర్‌గిద్దలో అన్నపూర్ణ (కాంగ్రెస్), గోందెగమ్‌లో ఎన్ శశికళ (కాంగ్రెస్), ఉమ్లతండాలో రతన్‌సింగ్(కాంగ్రెస్), షికర్‌ఖానలో సంగమ్మ సంగ్‌శెట్టి(కాంగ్రెస్), సక్నతండాలో హమకుబాయి(కాంగ్రెస్), ఉటప్‌పల్లిలో నాగమ్మ పండరి(కాంగ్రెస్), మేగ్యతండాలో హట్టిసింగ్(కాంగ్రెస్), ఏస్గిలో లక్ష్మణ్‌జాదవ్(బిఆర్ఎస్), కారముంగిలో రవిపాటిల్(బిఆర్ఎస్), కిషన్‌తండాలో నేనావత్ స్వప్న(బిఆర్ఎస్), లేఖ్యతండాలో అనుషబాయి(బిఆర్ఎస్), ముక్తాపూర్‌లో సుభాష్ చంద్రబోస్ (స్వతంత్ర), నాగల్‌గిద్దలో సిద్దంగి లక్ష్మి(స్వతంత్ర), వల్లూర్‌లో సంషద్ బేగం (స్వతంత్ర)లను ఓటర్లు సర్పంచ్‌లుగా ఎన్నుకోగా మండల పరిధిలోని కేశ్వర్ పంచాయతికి కాంగ్రెస్ మద్దతుదారులైన ముంగే మమాదేవి, గంగారం తండాలో రాథోడ్ రేణుక, కోండనాయక్ తండాలో అశోక్ చౌహన్‌లను ఆయా గ్రామస్తులు ఏకగ్రీవంగా సర్పంచులను ఎన్నుకున్నారు.

## రెండవ రోజు కొనసాగిన క్రీడా పోటీలు

**కంది, డిసెంబరు 17, ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని అగ్రికల్చర్ ఇంజినీ రింగ్ పాలిటెక్నిక్ కళాశాలలో కొనసాగుతున్న అంతర్-పాలిటెక్నిక్ క్రీడలు, సాంస్కృతిక, సాహిత్య పోటీలు రెండవరోజైన బుధవారం ఉత్సాహంగా కొనసాగాయి. అథ్లెటిక్స్ పోటీల్లో బాలికలు, బాలురు ఉత్సాహంగా పాల్గొని తమ సత్తాచాటారు. జావిలిన్ త్రో(బాలికల) పోటీలో జోగిపేటకు చెందిన ప్రతిభ ప్రథమ స్థానం సాధించగా నారాయణపేటకు చెందిన వైశాలి ద్వితీయ స్థానం, మూడవ స్థానంలో టోర్నాలకు చెందిన ఎస్తేరు నిలిచారు. బాలికల డిస్కస్ త్రోలో పాలెంకు చెందిన పుష్పవతి మొదటి స్థానంలో, కందికి చెందిన వైశాలి రెండవ స్థానంలో, జోగిపేటకు చెందిన సృజన మూడవ స్థానంను దక్కించుకున్నారు.100 మీటర్ల పరుగు పందెంలో టోర్నాలకు చెందిన అఖిల మొదటి స్థానంలో, జోగిపేటకు చెందిన స్వాతి రెండవ స్థానంలో, కందికి చెందిన వైశాలి మూడవస్థానంలో నిలిచారు. 400 మీటర్ల పరుగు పందెంలో జోగిపేటకు చెందిన వైశాలి మొదటి స్థానంలో, స్వాతి రెండవ స్థానంలో, టోర్నాలకు చెందిన అఖిల మూడవ స్థానంలో నిలిచారు. బాలికల షాట్‌పుట్‌లో జోగిపేటకు చెందిన గంగోత్రి మొదటి స్థానంలో పాలెంకు చెందిన మేఘన రెండవ స్థానంలో కందికి చెందిన వైశాలి మూడవ స్థానంలో నిలిచారు. లాంగ్‌జంప్‌లో నారాయణపేటకు చెందిన హారిక మొదటి స్థానంలో, టోర్నాలాకు చెందిన అఖిల రెండవ స్థానంలో, జోగిపేటకు చెందిన స్వాతి మూడవ స్థానం దక్కించుకున్నారు. బాలుర విభాగంలో 100 మీటర్ల పరుగు పందెంలో టోర్నాలకు చెందిన శివ మొదటి స్థానంలో, పాలెంకు చెందిన కర్నాకర్ రెండవ స్థానంలో జోగిపేటకు చెందిన ప్రశాంత్ మూడవ స్థానంలో నిలిచారు. 400 మీటర్ల పరుగుపందెంలో పాలెంకు చెందిన సిద్దార్థ మొదటి స్థానంలో టోర్నాలాకు చెందిన నరేష్ రెండవ స్థానంలో, రాహుల్ మూడవ స్థానంలో నిలిచారు. జూవెలిన్ త్రోలో పాలెంకు చెందిన సిద్దార్థ మొదటి స్థానంలో టోర్నాలాకు చెందిన ఎన్ నరేష్ రెండవ స్థానంలో, రాహుడ్ మూడవ స్థానంలో నిలిచారు. లాంగ్ జంప్‌లో జోగిపేటకు చెందిన కార్తికేయ మొదటి స్థానంలో టోర్నాలకు చెందిన ప్రశాంత్ రెండవ స్థానంలో, పాలెంకె చెందిన మనోహర్ మూడవ స్థానంలో నిలిచారు. బాలుర డిస్కస్‌లో పాలెంకు చెందిన నవదీప్ మొదటి స్థానంలో సిద్దార్థ రెండవ స్థానంలో జగిత్యాలకు చెందిన ప్రకాశ్ మూడవ స్థానంలో నిలిచారు. షాట్‌పుట్‌లో నారాయణపేటకు చెందిన శివ మొదటి స్థానంలో మధిరర సాయి చరణ్ రెండవ స్థానంలో పాలెంకు చెందిన శాంతికుమార్ మూడవ స్థానంలో నిలిచారు. క్విజ్ పోటల్లో పాలెం పాలిటెక్నిక్ మొదటి స్థానంలో మధిర రెండవ స్థానంలో, జగిత్యాల మూడవ స్థానంలో నిలిచాయి.

## రేవంత్‌రెడ్డి చీఫ్ మినిస్టర్ కాదు కటింగ్ మాస్టర్

### మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్‌రావు

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:** కాంగ్రెస్, బిజెపిల దొంగ నాటకాలకు గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ప్రజలు కర్రు కాల్చి వాత పెట్టారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు అన్నారు. సిద్దిపేట నియోజకవర్గంలోని వివిధ గ్రామాల నుంచి బుధవారం హైదారాబాద్ లోని ఆయన స్వగృహంలో కాంగ్రెస్, బిజెపిలకు రాజీనామా చేసి హరీష్‌రావు సమక్షంలో బిఆర్ఎస్‌లో చేరారు.ఈ సందర్భంగా ఆయన పార్టీలో చేరిన వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి చీఫ్ మినిస్టర్ కాదని పేదల పథకాలకు ఎసరు పెట్టే కటింగ్ మాస్టర్ అన్నారు. బిజెపిది సబ్కా సాత్ సబ్కా వికాస్ కాదని అది సబ్కా బక్వాస్ అన్నారు. కేంద్రంలోని బిజెపి సర్కార్ వద్ల కన్నా గోధుమలకు రేటు ఎక్కవగా ఇస్తూ తెలంగాణ రైతులకు తీరని అన్యాయం చేస్తుందన్నారు. కాంగ్రెస్, బిజెపిలు ప్రజల్లో విశ్వసనీయత కోల్పోయారని చెప్పారు. కెసిఆర్ సిఎం కావాలి బిఆర్ఎస్ పార్టీ మళ్లీ రావాలని పల్లెల్లో ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. గ్రామాల్లో కాంగ్రెస్, బిజెపిలకు ప్రజలు ఓటుతో బుద్ది చెప్పారని పేర్కొన్నారు. జిల్లాలో ప్రజలు పంచాయతీ ఎన్నికల్లో బిఆర్ఎస్‌కే పట్టం కట్టారని వివరించారు. కాంగ్రెస్ సర్కార్ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలకే బాకీ పడిందన్నారు. అలాగే నియోజకవర్గంలోని వివిధ గ్రామాల్లో సర్పంచ్‌లుగా, వార్డు సభ్యులుగా గెలుపొందిన వారు హరీష్‌రావును కలిశారు. హరీష్‌రావును కలిసిన నూతన సర్పంచ్‌లను, వార్డు సభ్యులను అభినందించి శాలువాలతో సత్కరించారు. ఆయా కార్యక్రమాలల్లో చిన్నకోడూరు మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కాముని శ్రీనివాస్, వివిధ పార్టీలకు రాజీనామా చేసి బిఆర్ఎస్‌లో చేరిన వారు ఉన్నారు.



బిజెపి నుంచి బిఆర్ఎస్‌లో చేరిన వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న హరీష్‌రావు



నాణ్యత లేని వస్తువులు, తనిఖీలుచేస్తున్న అధికారి స్వదీప్ కుమార్

## రామాయంపేటలో ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలు

### రెస్టారెంట్‌పై కేసు నమోదు

**రామయంపేట, డిసెంబర్ 17, ప్రభాతవార్త** పట్టణంలోని ఒక రెస్టారెంట్‌లో ఆహార భద్రతా అధికారి విస్తృత తనిఖీలు చేపట్టారు. మెదక్‌జిల్లా ఆహార భద్రత అధికారి స్వదీప్‌కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది తనిఖీలు చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ హోటళ్లు, రెస్టారెంట్లపై తనిఖీలు చేస్తున్నామని, నిబంధనలు పాటించని హోటళ్లపై చర్యలు తీసుకుంటామన్నారు. ఆహార భద్రత ప్రమాణాలను మెరుగు పరచడానికి విరివిగా తనిఖీలు నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. అందులో భాగంగా బుధవారం రామాయంపేటలోని రెస్టారెంట్‌లో ఆహార భద్రతాఅధికారి తనిఖీ నిర్వహించారు. తనిఖీలో గడువు ముగిసిన ఆహార ఉత్పత్తులు దుకాణంలో బూజుపట్టిన పాపడ్‌లు కనిపించాయి, స్టోర్‌రూమ్‌లో దొరికిన గడువు ముగిసిన షెజ్వాన్ సాస్‌బాటిళ్లను రెస్టారెంట్‌లోని చైనీస్ వంట గదిలో ఉపయోగిస్తున్నారు.ఈ వస్తువులను ధ్వంసం చేశారు. ఇతర ఉల్లంఘనలను గుర్తించి నోటీసు జారీ చేశారు. జరిమానా విధించడానికి కేసు నమోదు చేయడానికి పంచమామ చేశారు. ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడుతున్న హోటళ్లు, రెస్టారెంట్లు యాజ మాన్యాలపై ఫుడ్‌సేఫ్టీ ఉక్కుపాదం మోపుతుందని స్వదీప్‌కుమార్ వివరించారు. ఆహార నాణ్యత ప్రమా ణాలు పాటించని హోటళ్లు, రెస్టారెంట్లు, బార్లతో పాటు సూపర్ మార్కెట్లు, ఐస్‌క్రీం పార్లర్లు ఇతర వాటిపై తనిఖీలు నిర్వహిస్తూ నిబంధనలు ఉల్లం ఘించిన వారిపట్ల కఠినంగా వ్యవహరిస్తున్నామ న్నారు. తనిఖీలలో ఫుడ్ శాంపిల్స్ అసిస్టెంట్ నజీర్, సిబ్బంది, అరవింద్ పాల్గొన్నారు.



చిన్నకోడూరు సర్పంచ్ ఇట్టబోయిన శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న దృశ్యం

## చిన్నకోడూరు సర్పంచ్‌కు సన్మానం

**చిన్నకోడూరు, డిసెంబరు 17,ప్రభాతవార్త :** చిన్నకోడూరు సర్పంచ్‌గా గెలుపొందిన ఇట్టబోయిన శ్రీనివాస్‌ముదిరాజ్‌ను రాజీవ్‌కాలనీ దళిత సంఘం సభ్యులు, టి.ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు బబ్బురు కనకయ్య(ఏసు), బబ్బురు మల్లేశం, ఏటి గౌతమ్ తదితరులు ఆయన స్వగృహంలో బుధవారం కలిసి శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా నూతన సర్పంచ్ ఇట్టబోయిన శ్రీనివాస్ మాట్లాడుతూ మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీష్‌రావుతోపాటు ప్రజలందరి సహకారంతో చిన్నకోడూరు గ్రామాన్ని అన్ని రంగాలల్లో అభివృద్ధి చేయడానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం ప్రతినిధులు జంగిటి శ్రీనివాస్, ఇట్టబోయిన బాబు, కోరమైన రాజు తదితరులు పాల్గొన్నారు.

## మామిడ్యాల గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతా

### -సర్పంచ్ ఎడ్ల పోచయ్య



మాట్లాడుతున్న మామిడ్యాల గ్రామ సర్పంచ్ ఎడ్ల పోచయ్య

**ములుగు, డిసెంబరు 17 (ప్రభాతవార్త):** ములుగు మండలం మామిడ్యాల గ్రామ సర్పంచ్‌గా ఎడ్ల పోచయ్య ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో భారీ మెజార్టీతో ఘన విజయం సాధించగా బుధవారం కాంగ్రెస్ పార్టీ ములుగు మండల అధ్యక్షుడు శ్రీనివాస్ ఆధ్వర్యంలో శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలోనే అభివృద్ధి సాధ్యమని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి ఓటు వేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. సర్పంచ్ పోచయ్య మాట్లాడుతూ గ్రామ సర్పంచ్‌గా అవకాశం కల్పించిన ప్రజలకు, ముఖ్యంగా యువతకు కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను దశలవారీగా నెరవేరుస్తానని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలో గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి ఆధ్వర్యంలో గ్రామానికి నిధులు తెచ్చి పెండింగ్ పనులు పూర్తిచేసి జిల్లాలోనే ఆదర్శవంతమైన గ్రామంగా తీర్చిదిద్దుతామన్నారు.కార్యక్రమంలో మాజీసర్పంచ్ నాగరాణి శ్రీనివాస్, నాయకులు స్వామి, రామకృష్ణ, శివకుమార్, బాబు, సత్తయ్య, కరుణాకర్, యువకులు పాల్గొన్నారు.

## ఖేడ్ మండలంలో 79 శాతం పోలింగ్

**నారాయణఖేడ్, డిసెంబరు 17 ప్రభాతవార్త :** మండల పరిధిలోని 47 గ్రామ పంచాయతీలకుగాను 7 ఏకాగ్రీవంకాగా బుధవారం 40 పంచాయతీ లకు మూడో విడతలో ఎన్నికలు జరిగాయి. మండలంలోని అంత్వర్, తుర్కపల్లి, చప్టా, సంజీవన్‌రావుపేట్, నిజాంపేట్, రుద్రారంలతో పాటు ఆయా జీపిలో డీఎస్పీ వెంకట్రాంరెడ్డి ఆధ్వర్యంలో భారీ బందోబస్తు నిర్వ హించారు. ఆయా పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు ఓటు హక్కు వినియోగిం చుకోవడానికి బారులుతీరారు. ఉదయం ఏడు గంటల నుండి ఒంటి గంట వరకు పోలింగ్ జరిగింది. యువత తొలిసారి ఓటు ఉత్స వంతో వేశారు. ఉదయం చలి తీవ్రత అధికం ఉండడం తో కొంత మందకోడిగా జరిగింది. అనంతరం మధ్యాహ్నం విరామ తర్వాత ఓట్ల లెక్కింపు జరిగింది.

## సిర్గాపూర్ మండలంలో 87.47 శాతం పోలింగ్

**సిర్గాపూర్, డిసెంబరు 17, ప్రభాతవార్త:** మండలంలోని ఆయా గ్రామ పంచాయితీలకు బుధవారం జరిగిన 3వ విడత పంచాయతీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిసాయి. మండలంలో 7 పంచాయతీలు ఏకగ్రీవం కాగా 21 పంచాయతీలకు బుధవారం ఎన్నికలు జరిగాయి. మండలంలో 2490 మంది ఓటర్లు ఉండగా 19227 మంది ఓటు హక్కును వినియో గించుకున్నట్లు (87.47 శాతం) ఎంపిడిఓ శారదా దేవి ప్రకటించారు.


సేవ్యనాయక్‌ను సన్మానిస్తున్న డిసిసిబి డైరెక్టర్, పిఏసిఎస్ చైర్మన్ గంప వెంకటేశ్‌గుప్త

## గానుగుమర్లతండా అభివృద్ధి పథంలో దూసుకుపోవాలి

సేవ్యను సత్కరించిన గంప వెంకటేశ్

**ఆమనగల్లు, డిసెంబరు17, ప్రభాతవార్త:** కడ్తాల మండలం గానుగుమర్ల పంచాయతీకి జరిగిన ఎన్నికల్లో సర్పంచుగా విజయం సాధించిన పిఏసిఎస్ డైరెక్టరు సేవ్యానాయక్ తన పదవికి బుధవారం రాజీనామా చేశారు. ఆమనగల్లు సింగిల్‌విండో కార్యాలయంలో పిఏసిఎస్ చైర్మన్, డిసిసిబి డైరెక్టర్ గంప వెంకటేశ్ సమక్షంలో సేవ్యనాయక్ తన రాజీనామా పత్రాన్ని సిఈఓ దేవేందర్‌కు అందజేశారు. పత్రాన్ని పాలకవర్గం ఆమోదించి డిసిఓకు పంపారు. ఈసందర్భంగా గంప వెంకటేశ్‌గుప్త సేవ్యనాయక్ విజయం పట్ల అభినందించారు. పిఏసిఎస్ డైరెక్టర్‌గా సేవ్యనాయక్ తన కర్తవ్యాన్ని సమర్థవంతంగా నిర్వర్తించి రైతులకు మెరుగైన సేవలందించారని కొనియాడారు. నిస్వార్థ సేవలకు ఎల్లప్పుడూ ప్రజల హృదయాల్లో సుస్థిర స్థానం ఉంటుంది కాబట్టి పంచాయతీ ఎన్నికల్లో సర్పంచుగా విజయం సాధించారన్నారు. సేవ్యనాయక్ నాయకత్వంలో గానుగుమర్లతండా అభివృద్ధి పథంలో దూసుకుపోవాలని గంప వెంకటేశ్‌గుప్త ఆకాంక్షించారు. ఈసందర్భంగా సేవ్య గెలుపును కొనియాడుతూ ఆయనను శాలువాతో సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో పిఏసిఎస్ వైస్ చైర్మన్ దోనాదుల సత్యం, డైరెక్టర్లు జోగు వీరయ్య, జంగమ్మ, ఎనుముల రమేశ్, కార్యాలయ సిబ్బది చుక్క అల్లాజీగౌడ్, మహేశ్, సురేష్ తదితరులు ఉన్నారు.


డివై నర్సిములును సన్మానిస్తున్న మహేందర్‌రెడ్డి

## అభివృద్ధికి బాటలు వేయండి

...తమ వంతు సహకారం అందిస్తాం

...ప్రభుత్వ చీప్‌విప్ పట్నం మహేందర్‌రెడ్డి

**పెద్దేముల్, డిసెంబరు 17, ప్రభాతవార్త:** కొత్తగా ఎన్నికైన సర్పంచ్‌లు అభివృద్ధికి బాటలు వేయాలని, తమ వంతు సహకారం అందిస్తామని ప్రభుత్వ ఛీప్‌విప్ పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల పర్యటనలో భాగంగా పెద్దేముల్ నూతన సర్పంచ్‌గా భారీ మెజార్టీతో గెలుపొందిన డివై నర్సిములు ఆయనకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా డివై నర్సిములుతో పాటు వార్డు సభ్యులు నాగభూషణం తదితరులను ఆయన శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ గతంలో పెద్దేముల్ గ్రామపంచాయతీ అభివృద్ధికి నిధులు అందించామని, ఇప్పుడు కూడా అవసరమైన మౌళిక సదుపాయాల కోసం నిధులు మంజూరు చేస్తామని అన్నారు. రాజకీయాలకు అతీతంగా పంచాయతీని అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం అందించే సంక్షేమం, అభివృద్ధి పథకాలు ప్రతి పేదకు అందేలా చూడాలని అన్నారు. డివై నర్సిములు సైతం మహేందర్‌రెడ్డిని శాలువాతో సన్మానించి తనకు అండగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ మాజీ చైర్మెన్ పి.నారాయన్‌రెడ్డి, సీనియర్ నాయకులు మధుసూధన్‌రెడ్డి, నాగభూషణం, దాసరి సాయులు, రంగయ్య తదితరులు పాల్గొన్నారు.


అయ్యప్పస్వామి పూజలో పాల్గొన్న మహేందర్‌రెడ్డి

## భక్తితోనే సత్ప్రవర్తన

..ప్రభుత్వ చీఫ్‌విఫ్ మహేందర్‌రెడ్డి

**పెద్దేముల్, డిసెంబరు 17, ప్రభాతవార్త:** ప్రతి వ్యక్తి భక్తిభావం పెంచుకోవాలని, తద్వార సత్ప్రవర్తన, పరోపకారం తదితర సామాజిక లక్షణాలు అలవడుతాయనిప్రభుత్వ చీఫ్‌విప్ పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. బుదవారం పెద్దేముల్ మండల కేంద్రంలో తాండూరు మార్కెట్ కమిటి మాజీ ఉపాధ్యాక్షులు జితేందర్‌రెడ్డినివాసంలో అభినవ్‌రెడ్డి (కన్యస్వామి) అధ్వర్యంలో అయ్యప్పస్వామి పడిపూజ కార్యక్రమం భక్తిశ్రద్దలతో కన్నుల పండువగా నిర్వహించారు. అయ్యప్పస్వామిపడిపూజకు మహోత్సవానికి పట్నం మహేందర్‌రెడ్డి హజరై మాట్లాడుతూ అయ్యప్పస్వామి పడిపూజ నిర్వహించడం ఎంతో ధన్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ డిసిసిబి చైర్మెన్ పి.లక్ష్మారెడ్డి, మాజీ డిఎల్‌డిఏ చైర్మెన్ పి.నారాయన్‌రెడ్డి, ఆర్‌బిఎల్ సీఈఓ బుయ్యని శ్రీనివాస్‌రెడ్డి, కోటపల్లి మార్కెట్ కమిటి చైర్మెన్ అంజయ్య, వైస్ చైర్మెన్ ఎస్.నారాయన్‌రెడ్డి, సర్పంచ్‌లు డివై నర్సిములు, నారాయన్‌గౌడ్. గోపి నాయక్, సోసైటి చైర్మెన్ ద్యావరి విష్ణువర్ధన్‌రెడ్డి,నాయకులు కొమ్ము గోపాల్‌రెడ్డి, రుద్రారం గోపాల్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, నరేష్‌రెడ్డి, ఎల్లారెడ్డి, బందెప్ప, కోహీర్ రవి, మధుసుధన్‌రెడ్డి,శిల్పి, ఇందూరు మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## అత్వెల్లి పేరుతో డివిజన్ ఏర్పాటు చేయాలి


ముస్సిపల్ అధికారులకు వినతి పత్రం అందజేస్తున్న అత్వెల్లి గ్రామ నాయకులు

**మేడ్చల్, డిసెంబరు17. ప్రభాతవార్త :** జిహెచ్‌ఎంపి 298 కిష్టాపూర్ డివిజన్‌కు బదులుగా అన్ని విధాల అందుబాటులో ఉన్న అత్వెల్లి పేరుతో డివిజన్ ఏర్పాటు చేయాలని కోరుతూ ఆ గ్రామ నాయకులు అధికారులకు వినతి పత్రం అందజేశారు. జిహెచ్‌ఎంసిలో విలీనం అయిన మేడ్చల్ ముస్సిపాలిటిని రెండు డివిజన్ వార్డులుగా మార్చారు. అందులో భాగంగా ఏర్పాటు చేసిన 298 కిష్టాపూర్ డివిజన్ ఉన్న పేరును అత్వెల్లి డివిజన్‌గా పేరు మార్చాలని కోరారు. అత్వెల్లి ప్రాంతం జాతీయ రహదారికి దగ్గరగా, అన్నింటికి అనుకూలంగా, సౌకర్యంగా ఉంటుందని, అత్వెల్లిలో అధునాతన వార్డు కార్యాలయం ఉందని, మెరుగైన రవాణా సౌకర్యం ఉందని తెలిపారు. అత్వెల్లి పేరు అన్ని ప్రాంతాలకు అనుకూలంగా ఉండి, రెవిన్యూ పరంగా చాలా వరకు విస్తరించి ఉందని అన్నారు. అందుకు అత్వెల్లి పేరు మీద డివిజన్ పేరు మార్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మండల ఈశ్వరయ్య, మండల రవి కుమార్, గోగికర్ హరి, వెంకటేశం, నారాయణ, కృష్ణ, సాయి ,రాహుల్ , సుల్తాన్ తదితరులు పాల్గొనారు.

# నర్సాపూర్ మండలంలో 93.38 శాతం

### కాంగ్రెస్ 16, బిఆర్ఎస్ 16 సర్పంచ్‌లు ఎన్నిక.. ఒకరు ఇండిపెండెట్

**నర్సాపూర్, డిసెంబరు 17, ప్రభాతవార్త:** మండలంలో జరిగిన సర్పంచ్ ఎన్నికల పోలింగ్ శాతం 93.38 నమో దైంది. అధికార పార్టీ ప్రతిపక్ష పార్టీ టిఆర్ఎస్ మధ్య హోరాహోరీ పోరు జరగగా కాంగ్రెస్ పార్టీ తరపున 16 మంది, టిఆర్ఎస్ పార్టీ కి చెందిన సర్పంచులు 16 మంది ఎన్నికకాగా ఒకరు ఇండిపెండెట్‌గా ఎన్నికయ్యారు మండలం లోని 35 గ్రామ పంచాయతీలకుగాను 2 గ్రామ పంచా యతీలు ఎర్రగుంటతండా రూప్సింగ్‌తండాలకు సర్పంచులు ఏకగ్రీవమయ్యారు. అయితే బుధవారం మిగతా 33 గ్రామ పంచాయతీలకు ఎన్నికలు జరిగాయి. నర్సాపూర్ మండలం లో ఈ స్థానిక సంస్థల సర్పంచ్ ఎన్నికల్లో నర్సాపూర్ మండలంలో రెండు గ్రామ పంచాయతీలకు ఏకగ్రీవం కాగా సురేష్ నాయక్ ఎర్రగుంట తండా సర్పంచ్‌గా ఎన్నిక కాగా రూప్ సింగ్ తండా సర్పంచ్ గా గెమ్య నాయక్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మిగతా 33 గ్రామ పంచా యతీ సర్పంచుల ఎన్నికకు పోలింగ్ ప్రశాంతంగా జరిగాయి. గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు క్యూలైన్‌లో నిల్చుని తమ ఓటు హక్కును వినియోగించు కున్నారు. పోలింగన కేంద్రాల వద్ద ఎక్కడ ఎటువంటి అవాంఛనీయ మైన సంఘటనలు జరుగ కుండా పోలీ సులు ఇఐ జానఖరెడ్డి, ఎస్ఐ రంజిత్‌కుమార్ రెడ్డి లు తమ పోలీసన సిబ్బందిని అప్రమత్తం చేసి గట్టి బందోబస్తు నిర్వమించారు. ఈమేరకు మండలంలో ఎలాంటి సంఘటనలు జరుగకుండా పోలింగ్ ప్రశాంతంగా ఈ ఎన్నికలు జరిగాయి.

**నర్సాపూర్ మండలంలో గెలుపొందిన సర్పంచ్‌లు వీరే..**

స్థానిక సంస్థల ఎన్నికల్లో సర్పంచ్‌లుగా గెలుపొందిన వారు మండల పరిధిలోని అచ్చంపేట్ గ్రామపంచాయతీ సర్పంచ్‌గా నీరుడు తుల్జమ్మ ఎన్నిక కాగా అద్మా పూర్ సర్పంచ్‌గా దేవసత్ బుజ్జి, అహ్మద్‌నగర్ సర్పంచ్‌గా మధుకర్‌రెడ్డి, ఆవంచ సర్పంచ్ రాజపేట్ స్రవంతి, బ్రాహ్మణపల్లి సర్పంచ్‌గా కోల్హాల్మ ఆనంద్ యాదవ్, చిన్నచింతకుంట సర్పంచ్‌గా ప్యాట సరితా మహేష్‌గౌడ్, చిప్పల్‌తుర్తి సర్పంచ్ గా మచ్చుకూరి సుధాకర్, గొల్లపల్లి సర్పంచ్‌గా ఉసిరికపల్లి లక్ష్మి, గూడంగడ్డ సర్పంచ్ జన్మల నర్సింలు, ఇబ్రహీంబాద్ సర్పంచిగా కొండల్‌రెడ్డి, జక్కపల్లి సర్పంచ్‌గా దుప్తల భరత్‌కుమార్, కాగజ్ మద్దూర్ సర్పంచ్ గా విజయ శివకుమార్, కాజిపేట్ సర్పంచ్‌గా దొంతి యాదగిరి గౌడ్, లింగాపూర్ సర్పంచ్ గా బోర్లెపు రాజకళ, మాధాపూర్ సర్పంచ్‌గా రమావత్ సునీతరాములునాయక్, మంతూర్ సర్పంచ్‌గా మల్డొడ్డి వెంకటేశం, మహమ్మదా బాద్ సర్పంచ్‌గా నున్నావత్ బిందు సురేష్, మూసాపేట్ సర్పంచ్‌గా గద్దం మమత సత్యనారాయణ, నాగులపల్లి సర్పంచ్‌గా సుమతి, నారాయణపూర్ సర్పంచ్‌గా దేవి


మాదాపూర్ సర్పంచ్‌గా ఎన్నికైన సునీతారాములునాయక్ కు నియామకపు పత్రాన్ని అందజేస్తున్న ఎన్నికల అధికారులు

సింగ్‌నాయక్, నత్నాయపల్లి సర్పంచ్‌గా ఉదయ్‌కుమార్, పిల్లికుంట్లతండా సర్పంచిగా ధరావత్ పద్మ, రాంచంద్రా పూర్ సర్పంచ్‌గా తలారి గీత, రాంజ్య తాండ సర్పంచ్‌గా నర్సింగ్‌నాయక్, రెడ్డిపల్లి సర్పంచ్‌గా గుడ్డి పద్మావతి అశోక్‌గౌడ్, రుస్తుంపేట్ సర్పంచ్‌గా ఈటూరి వర్ష, సీతారాంపూర్ సర్పంచ్‌గా ఎర్ర పోచయ్య, తిరుమలా పూర్ సర్పంచ్ గా కంజర్ల సాయిలు, తుజాల్పూర్ సర్పంచ్ గా మాలోత్ బుజ్జి పాండు, తుల్జారాంపేట్ సర్పంచ్ గా కవిత కిషన్‌నాయక్, ఎల్లాపూర్ సర్పంచ్‌గా సత్తారం కృష్ణ, ఎల్లారెడ్డిగూడ తాండ సర్పంచ్ గా బిక్కు నాయక్, పెద్ద చింతకుంట సర్పంచ్ గా గుండె శివకుమార్ ఎన్నిక కాగా రెండు గ్రామపంచాయతీలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు ఈ ఎన్నికల్లో గ్రామాల్లో ఎటువంటి అల్లర్లు అలజడులు జరగకుండా పోలీసులు సీఐ జాన్ రెడ్డి, ఎస్ఐ రంజిత్ కుమార్‌రెడ్డి అధ్వర్యంలో గట్టి బందోబస్తు ఏర్పాటు చేయ గా ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి.

**వెల్దుర్తి మండలంలో గెలిచిన సర్పంచ్ అభ్యర్థులు వీరే**

**వెల్దుర్తి, డిసెంబరు 17 ప్రభాతవార్త:** మండలంలో మూడో విడత ఎన్నికలు ప్రశాంతంగా బుధవారం నాడు ముగిస్తాయి. సర్పంచులుగా మండల కేంద్రమైన వెల్దుర్తి మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ గా ఆదర్శ బిజెపి 501, ఓటు మెజార్టీతో గెలుపొందారు. అలాగే సెరిలా గ్రామంలో బంజే లావణ్య కాంగ్రెస్. ఆరెగూడెం గన్నవరం చైతన్య టిఆర్ఎస్. ధర్మారం వీర యాదమ్మ కాంగ్రెస్. ఎద్దులపల్లి బందీల చందన టిఆర్ఎస్. మంగళపర్తి బాలయ్య గారి సంధ్య కాంగ్రెస్. అందుగులపల్లి మహమ్మద్ వ్యాధులు కాంగ్రెస్. బండ పోచంపల్లి తిరుమల మంజుల కాంగ్రెస్. యశ్వంతరావుపేట్ బాగాగోని మల్లేశం గౌడ్ బిజెపి. రామయపల్లి బరుర్ పావని టిఆర్ఎస్. శెట్టిపల్లి కలాం పడితే శేఖర్ కాంగ్రెస్. ఎలుకపల్లి కనికే పావని స్వతంత్ర. ఉప్పులింగాపూర్ వంచ భూపాల్ రెడ్డి టిఆర్ఎస్. దామరంచ వెల్దుర్తి నాగమణి కాంగ్రెస్. చల్లపల్లి లంబాడి అరుణ స్వతంత్ర. బస్వాపూర్ నగ్మా సుల్తానా స్వతంత్ర. శశి రెడ్డి పల్లి బానోత్ గణేష్ స్వతంత్ర. అస్సల్పూర్ మాధవరెడ్డి గారి నరసింహారెడ్డి టిఆర్ఎస్. మనేపల్లి బంజ సోమప్ప టిఆర్ఎస్. మహమ్మద్ తాండ మలావత్చందర్ టిఆర్ఎస్. కుకునూర్ బ్రాహ్మణపల్లి సాయిలు టిఆర్ఎస్. మనోహర్ జలాల్పూర్ రంగి కృష్ణ బిఆర్ఎస్. సర్పంచు లుగా గెలుపొందారు.

# రోడ్డుమీద గుంతలు... ప్రజల ఇబ్బందులు

**ఆమనగల్లు , డిసెంబరు17, ప్రభాతవార్త:** ఆమనగల్లు పట్టణంలోని శ్రీకాంత్ కాలనీ ప్రవేశ మార్గంలో సిసి రోడ్డు పూర్తిగా ధ్వంసమై పెద్దగోతులు ఏర్పడ్డాయి. గోతుల మూలంగా ప్రజల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. సమీపం నుండి వస్తున్న నీరు గుంతలలో చేరి మరింత ఇబ్బందిని కలిగిస్తున్నాయి. కాలనీవాసులకు ప్రధాన రహదారి కావడంతో వారి రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ముఖ్యంగా పశువైద్యశాలకు వచ్చే రైతులు, పశువులకు కూడా అసౌకర్యంగా మారింది. రోడ్డు మధ్యలో ఏర్పడిన గోతుల మూలంగా రాత్రి వేళల్లో ద్విచక్ర వాహనాలు ప్రమాదాలకు గురై వాహనదారులను గాయాలకు గురిచేశాయి. అలాగే సమీపంలో ఉన్న నివాసాలకు, వ్యాపారస్తులకు ఈ గుంతలు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నాయి. మున్సిపాలిటీ అధికారులు తక్షణమే స్పందించి ప్రజల ఇబ్బందులు తొలగించాలని శ్రీకాంత్ కాలనీవాసులు డిమాండ్


శ్రీకాంత్ కాలనీ పశు వైద్యశాల ఎదురుగా ఉన్న గుంతలు

# అనురాగ్‌లో ఘనంగా ఏఐ ఫ్రీ సమ్మిట్

**ఘట్‌కేసర్ రూరల్, డిసెంబరు 17, ప్రభాత వార్త:** ఏఐ సమ్మిట్ 2026 నిర్వహించడంతో విద్యార్థులను ఏఐ రంగంలో శక్తివంతం చేయడంతో తోడ్పడుతుందని ఏపి, తెలంగాణ హెచ్‌సీఎల్ హెడ్ సందీప్ అన్నారు. పోచారం సర్కిల్ వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీలో కృత్రిమ మేధస్సు( ఏఐ) విభాగంలో దేశంలో ఏఐ ఆధారిత భవిష్యత్తుకు విద్యార్థులను శక్తివంతం చేయడం అనేథీమ్‌తో ఏఐ సమ్మిట్ 2026కు అనుసంధానంగా ఫ్రీ సమ్మిట్ ఈవెంట్‌ను బుధవారం నిర్వహించారు. ఇండియా ఏఐ సమ్మిట్ 2026లో కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వశాఖ పర్యవేక్షణలో ఫిబ్రవరిలో న్యూఢిల్లీలో జరుగనున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం జాతీయ స్థాయిలో నిర్వహించే కార్యక్రమానికి అనురాగ్ యూనివర్సిటీ అధికారిక ఫ్రీ సమ్మిట్ నిర్వహించిందని తెలిపారు. హెచ్‌సీఎల్ హెడ్ సందీప్ మాట్లాడుతూ కృత్రిమ మేధస్సు, కంప్యూటర్ సైన్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, డేటా సైన్స్, సైబర్ సెక్యూరిటీ విభాగాలకు చెందిన దాదాపు 300 మంది విద్యార్థులతో ప్రత్యక్షంగా సంభాషించారు. ఇండియా ఏఐ సమ్మిట్ ప్రాముఖ్యతను వివరిస్తూ ఏఐ ఎకోసిస్టమ్‌ను బలోపేతం చేయడంలో గల పాత్రను వివరించారు. ఫార్చ్యూన్ 500 కంపెనీల్లో ఉన్న ఉద్యోగావకాశాలపై విలువైన సమాచారాన్ని విద్యార్థులకు వివరించారు. అగ్రశ్రేణి టెక్నాలజీ కంపెనీల్లో చేరాలని ఆశించే విద్యార్థుల కోసం స్పష్టమైన కెరీర్‌మార్గాలను తెలిపారు. కెరీర్‌లో విజయం సాధించడానికి ధృఢమైన సాంకేతిక నైపుణ్యాలు, ఇంటర్వ్యూ సిద్ధత, ఆంగ్లబాషా


అనురాగ్ యూనివర్సిటీలో నిర్వహించిన ఏఐ ఫ్రీ సమ్మిట్ సదస్సుకు హాజరైన అధ్యాపకులతో పాటు విద్యార్థులు.

కమ్యూనికేషన్ నైపుణాల ప్రాముఖ్యతను ప్రత్యేకంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికేట్, హెచ్‌సీఎల్ నుండి ఉచిత ఏఐ కోర్సు ఎయూ యూనివర్సిటీ విద్యార్థులకు భవిష్యత్ ఇంటర్న్‌షిప్ అవకాశాలు, 50 మంది విద్యార్థులకు ఇండస్ట్రీ విజిట్ అవకాశం కల్పించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల కృత్రిమ మేధస్సు హెడ్ మల్లిఖార్జున్‌రెడ్డి, ప్రొఫెసర్ విజయ్‌కుమార్, డీన్ ఎస్‌వోఈ విష్ణుమూర్తి, సిఎస్‌సి డీన్ శ్రీదేవి, ఎం. నితీషా శర్మ, ఫ్యాకల్టీ కో ఆర్డినేటర్ డానియల్, విద్యార్థులు పాల్గొన్నారు.

# కరాటేతో ఎన్నో లాభాలు

### మాజీ వైస్ ఎంపిపి రాజేష్ పటేల్

**కొందుర్గు, డిసెంబరు 17, ప్రభాతవార్త:** కరాటే నేర్చుకోవడం వల్ల ఎన్నో లాభాలు ఉన్నాయని మండల మాజీ వైస్ ఎంపీపీ రాజేష్ పటేల్ అన్నారు.

బుధవారం నాడు మండల కేంద్రంలోని బాలికల ప్రాథమిక ఉన్నత పాఠశాల లో ఏర్పాటుచేసిన ఉచిత కరాటే శిక్షణ తరగతులను ఆయన ప్రారంభించారు. అనంతరము అయన మాట్లాడుతూ చిన్నారులు కరాటే నేర్చుకోవడం వలన ఆత్మ రక్షణతో పాటు, శారీర దారుఢ్యం తోపాటు మానసిక ఉల్లాసం కలుగుతుందని అన్నారు. చదువుతోపాటు ప్రతి విద్యార్థిని కరాటే నేర్చుకోవాలని ఆయన సూచించారు. కరాటే క్లాసులు నిర్వహించడానికి ముందుకొచ్చిన మాస్టర్ జిల్లెల్ల రమేష్ ను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ నూతన సర్పంచ్ చౌడాపురం ప్రభాకర్, ఉపసర్పంచ్ చంద్రశేఖర్, విండో డైరెక్టర్ జగదీశ్వర్ గౌడు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు



వెంకటరెడ్డి, పంచాయతీ సభ్యులు శ్రీకాంత్, కరాటే మాస్టర్ జిల్లల రమేష్ తోపాటు సాయి కులకర్ణి, ఎన్కేపల్లి చిన్నరాజుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# పంట పొలాలకు నీటిని విడుదల చేయాలి

..కలెక్టర్ ప్రతీక్‌జైన్‌ను కోరిన ప్రభుత్వ చీఫ్‌విప్ పట్నం మహేందర్‌రెడ్డి

**పెద్దేముల్, డిసెంబరు 17, ప్రభాతవార్త:** పెద్దేముల్ మండలం మన్‌సాన్‌పల్లి గ్రామ రైతుల పంట పోలాలకు కోటపల్లి ప్రాజెక్టు నీటిని విడుదల చేయాలని జిల్లాకలెక్టర్ ప్రతీక్ జైన్‌ను ప్రభుత్వ చీఫ్‌విప్ పట్నం మహేందర్‌రెడ్డి కోరారు. పెద్దేముల్ మండల కేంద్రంలో నిర్వహించిన పలు కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయనకు మన్‌సాన్‌పల్లి సర్పంచ్ గోపి నాయక్, నాయకులు మాన్యనాయక్ తదితరులు కోటపల్లి ప్రాజెక్టు కాలువల మరమ్మత్తుల కారణంగా తమ పంటలకు అధికారులు నీటిని నిలిపివేస్తున్నారని మహేందర్‌రెడ్డికి పిర్యాదు చేశారు. ఒకటి రెండు రోజుల్లో ఇరిగేషన్ శాఖ అధికారులు పర్యటించ నున్నారని, ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్‌కు సమస్య వివరించి తమ పంటలు ఎండిపోకుండా నీటిని విడుదల చేయించాలని రైతులు కోరారు. స్పందించిన మహేందర్‌రెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌కు ఫోన్ చేసి కాలువల మరమ్మత్తుల కారణంగా పంట పోలాలు ఎండిపోకుండా చర్యలు తీసుకోవాలని సూచిం


రైతులతో మాట్లాడుతున్న మహేందర్‌రెడ్డి

చారు. మన్‌సాన్‌పల్లిలో చాలా మంది గిరిజన రైతులుఉన్నారని, వారి పంట దిగుబడి వస్తున్న తరుణంలో నీరు అందకుంటే నష్టపోతారని పేర్కొంటు, రైతులు నష్టపోకుండా మరి కొన్ని రోజులు పంటలకు నీటినివదిలి ఆ తరువాత మరమ్మత్తులు చేసేలా చూడాలని కలెక్టర్‌ను కోరారు. అందుకు స్పందించిన కలెక్టర్ రైతులకు నష్టం జరగకుండా చూస్తామని, పంటలు ఎండిపోకుండా నీరు అందిస్తామని హామి ఇచ్చారు.



## ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

వికారాబాద్ జిల్లా మాజీ జట్పీ చైర్ పర్సన్ సునీత మహేందర్‌రెడ్డి

**కోట్‌పల్లి, డిసెంబరు 17, ప్రభాతవార్త;** వికారాబాద్ జిల్లా కోట్‌పల్లి మండల పరిధిలోని మోత్కుపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నూతన సర్పంచు బి, అమృతమ్మ నారాయణ, ఉప సర్పంచు వార్డు సభ్యులు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు వికారాబాద్ జిల్లా జడ్‌పీ చైర్ పర్సన్‌ను బుధవారం నాడు హైదరాబాద్‌లోని అమె నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా అమె నూతన సర్పంచు, ఉప సర్పంచు, మరియు వార్డు సభ్యులకు శాలువలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా అమె మాట్లాడుతూ. కాంగ్రెస్ ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని , అర్హులైన వారందరికి సంక్షేమ పథకాలు అందజేయాలని అమె సూచించారు. ఈకార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర మైనార్టీ ప్రధాన కార్యదర్శి, వాహిద్‌మియా, సర్పంచు, బి,అమృతమ్మ నారాయణ, ఉప సర్పంచు పి, మాధవరెడ్డి, మాజీ సర్పంచు పి, పాండురంగారెడ్డి, వార్డు సభ్యులు ఖాజా, అమీర్‌పటేల్, సీఎచ్, ప్రభావతి అశోక్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, బి, భీమయ్య, మోత్కుపల్లి కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షులు ప్రభాకర్‌రెడ్డి, రంగారెడ్డి, భూపతిరెడ్డి, టి,బాల్‌రాజ్, బి, రామయ్య, టి, ప్రశాంత్, జి,రాజు, ఎస్, సురేష్, హైమాద్, బి,కిష్టయ్య, బి, సురేందర్ ,బి,విజయ్‌కుమార్,బి, రాంచంద్రి, మహేష్, ఎన్, రాజు, ముకుం ద్‌రెడ్డి,విలాస్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


వికారాబాద్ జిల్లా మాజీ జట్పీ చైర్‌పర్సన్ సునీత మహేందర్‌రెడ్డిని కలిసిన మోత్కుపల్లి గ్రామానికి చెందిన నూతన సర్పంచు బి, అమృతమ్మ నారాయణ

## లోక కళ్యాణం కోసమే అయ్యప్ప అవతరించారు

చేగూరులో అయ్యప్ప మహాపడిపూజలో పాల్గొన్న ఎమ్మెల్యే

**నందిగామ, డిసెంబరు 17, ప్రభాతవార్త:** హరిహర పుత్రుడు అయ్యప్ప లోక కళ్యాణం కోసమే కారణజన్ముడిగా అవతరించాడని, ఆయన దివ్య స్పర్శతో మానవాళికి మంచి జరుగుతుందని షాద్నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ స్పష్టం చేశారు. బుధవారం నందిగామ మండలం చేగూరు గ్రామంలో కొత్తగా సర్పంచ్ మంకాల శ్రీశైలం ఆధ్వర్యంలో మహా పడిపూజ కార్యక్రమాలకు ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తి మార్గం ద్వారానే ముక్తి మార్గం లభిస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ దైవాన్ని పూజించి ఆధ్యాత్మికచింతనను అలవర్చుకోవాలని సూచించారు. అయ్యప్ప ఆశీస్సులతో ప్రతి ఒక్కరికి మంచి జరగాలని ఆయన అయ్యప్పని వేడుకున్నారు. మహాపడి పూజలో గురుస్వాముల పాటలతో, భక్తిశ్రద్ధలతో శోభాయమానంగా సాగింది. అయ్యప్పల శరణుఘోషతో చేగూరు పరిసరప్రాంతాలు మారుమ్రోగాయి. వేడుకలో మాజీ ఎంపిపి ఎం శివశంకర్ గౌడ్, ఉప సర్పంచ్ ఆవుల మంద శివశంకర్, బుగ్గోని గూడ సర్పంచ్ సాలయ్య, కాంగ్రెస్ సీనియర్ నేత బుయ్యని వీరేందర్ గౌడ్, దరూర్ సతీష్ పటేల్, ఎం శ్రీనివాస్ గౌడ్, సాములయ్య, రాజశేఖర్, కుమార్ గౌడ్, తదితరులున్నారు.


చేగూర్ లో అయ్యప్ప మహా పడిపూజలో పాల్గొన్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

# మేడ్చల్‌లో సామూహిక వందేమాతర గీతాలాపన

**మేడ్చల్, డిసెంబరు 17. ప్రభాతవార్త :** వందేమాతర గీతం రచించి 150 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా మేడ్చల్ నగర వందేమాతర కమిటీ ఆధ్వర్యంలో బుధవారం మేడ్చల్‌లో వందేమాతర గీతాలాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని వివేకానంద విగ్రహం నుండి విద్యార్థులు, యువకులు, రాజకీయ, సామజిక సంస్థల నాయకులు కలిసి ఎంపిడిఓ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కార్యాలయ ఆవరణలో వందేమాతర గీతాన్ని ఆలాపన చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మేడ్చల్ సీఐ సత్యనారాయణ మాట్లాడుతూ ప్రతి భారతీయుడు తమ తమ వృత్తుల్లో చేసే పనులతో పాటు దేశాభివృద్ధి కొరకు కూడ పని చెయ్యాలని కోరారు. అనంతరం నాయకులు పాతూరి సుధాకర్ రెడ్డి, శైలజ హరినాథ్, వేముల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ దేశం కొరకు వందేమాతర నినాదంతో లాఠీలు, తుటాలకు ఎదురు నిలిచి లక్షల మంది ప్రాణ త్యాగలతో వెయ్యి సంవత్సరాల విదేశీ ముస్లిం, బ్రిటిష్ పాలకుల అరాచక హత్యాచారాల బానిసత్వం నుండి దేశానికి స్వాతంత్రం వచ్చిందని అన్నారు. లక్షల సంవత్సరాల భారతీయ సంస్కృతి హిందుత్వాన్ని రక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మేడ్చల్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ రమేష్, నాయకులు పాతూరి ప్రభాకర్ రెడ్డి, రఘురామ్, రాంచంద్ర రెడ్డి, నర్సింహ్లు, మధు ముదిరాజ్, శ్రీనివాస్ గుప్తా,రమేష్ ముదిరాజ్. శ్రీశైలం యాదవ్, సత్యనారాయణ యాదవ్, మల్లికార్జున్, లింగం, హరిబాబు రెడ్డి, బాబురాజ్, సత్యనారాయణ రెడ్డి, అర్జున్,రాజు,విద్యార్థులు పాల్గొన్నారు.


వందేమాతరం గీతాలాపన చేస్తున్న నాయకులు, విద్యార్థులు

## వచ్చే ఎన్నికల్లో బిజెపిదే అధికారం

-ఎమ్మెల్సీ డాక్టర్ చిన్నమైల్ అంజిరెడ్డి



బిజెపి సర్పంచ్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్సీ అంజిరెడ్డి

**రామచంద్రాపురం, డిసెంబరు 17, ప్రభాతవార్త:**
రెండేళ్ల తర్వాత వచ్చే శాసనసభ ఎన్నికల్లో బిజెపి అధికారంలోకి రావడం తథ్యమని బిజెపి పట్టభద్రుల ఎమ్మెల్సీ డాక్టర్ చిన్నమైల్ అంజిరెడ్డి ధీమా వ్యక్తంచేశారు. జహీరాబాద్ నియోజకవర్గంలో బిజెపి బలపర్చిన అభ్యర్థులు సర్పంచ్‌లుగా విజయంసాధించిన వారు బుధవారం రామచంద్రాపురంలోని ఎమ్మెల్సీ, బిజెపి జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి నివాసగృహంలో మర్యాదపూర్వకంగా కలుసుకోగా, ఎమ్మెల్సీ అంజిరెడ్డి సర్పంచ్‌లను శాలువాతో సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి, నాయకులు గొల్ల భాస్కర్, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

## సంగం సర్పంచ్‌గా ధర్మనాయక్

**సిర్గాపూర్, డిసెంబరు 17, ప్రభాతవార్త:**
బుధవారం జరిగిన పంచాయతీ ఎన్నికల్లో మండల పరిధిలోని సంగం పంచాయతీ సర్పంచ్‌గా బిఆర్ఎస్ మద్దతుదదారు ధర్మానాయక్ విజయం సాధించారు. పంచాయతీ బరిలో ఉన్న రామారావుపై ధర్మానాయక్ 98ఓట్ల మెజార్టీలో సర్పంచ్‌గా విజయం సాధించారు. ధర్మానాయక్ విజయంతో మద్దతుదారులు, బిఆర్ఎస్ నాయకులు టపాసులు కాలుస్తూ, మిఠాయిలు తినిపించుకుని సంబరాలు చేసుకున్నారు. గ్రామాభివృద్ధే లక్ష్యంగా పాలన సాగిస్తానని, తనకు మద్దతు పలికిన గ్రామ ఓటర్లకు, సహకరించిన పార్టీ శ్రేణులకు ధర్మానాయక్ కృతజ్ఞతలు తెలిపారు.

## సిసి రోడ్డు నిర్మాణానికి భూమి పూజ

**రామచంద్రాపురం, డిసెంబరు 17, ప్రభాతవార్త:**
రామచంద్రాపురం డివిజన్‌పరిధిలోని సాయిజ్యోతినగర్ కాలనీలో 13.50 లక్షల రూపాయలతో నిర్మించే సిసిరోడ్డు పనులకు బుధవారం కార్పొరేటర్, జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ సభ్యులు బూరుగడ్డ పుష్పనగేష్ భూమి పూజా కార్యక్రమాలు నిర్వహించి రోడ్డు నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ పుష్పనగేష్ మాట్లాడుతూ కాలనీలో మిగిలి ఉన్న డ్రైనేజి పనులకోసం నిధులు మంజూరుచేయించి 10రోజుల్లో డ్రైనేజి పనులకు శ్రీకారం చుడతామన్నారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు అశ్విన్ గౌడ్, రాజనర్సింహా, ప్రసాద్, మురళీధర్‌రెడ్డి, చంద్రశేఖర్, మోహన్, బేగరి పెంటయ్య, మల్లికార్జున్, బలరాం, నీలి రాజు, వెంకట్‌రెడ్డి, ఆర్వి రాజు, భోపాల్‌రెడ్డి, గారెల శ్రీశైలం, కాశాల వీరేశం, మల్లేష్ పాల్గొన్నారు.

## రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అభివృద్ధికి కృషి

-ఎమ్మెల్యే చింత ప్రభాకర్



నూతన క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే చింత ప్రభాకర్

**సదాశివపేట, డిసెంబరు 17, ప్రభాతవార్త:**
పట్టణంలోని రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు నిమ్మల మల్లేశం ఆధ్వర్యంలో నూతన క్యాలెండరును బుధవారం స్థానిక ఎమ్మెల్యే చింత ప్రభాకర్ క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే చింత ప్రభాకర్ చేతులమీదుగా నూతన క్యాలెండరును ఆవిష్కరించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ రిటైర్డ్ ఉద్యోగులసంఘం అభివృద్ధికి తమవంతు సహకారం ఎల్లవేళలా ఉంటుందన్నారు. సంఘం ఎదుర్కొంటున్న సమస్యలపై తమవంతు కృషిచేస్తామన్నారు. సంఘభవనంకోసం అన్నివిధాల సహకరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో చింత సాయినాథ్. సంగం జిల్లా సంయుక్త కార్యదర్శి టి.శ్రీనివాస్, కోశాధికారి షీలావిశ్వనాథం, పట్టణ కార్యదర్శి తుగుడే దాస్, అంబటి విశ్వనాథం, నాగారం పెంటయ్య, సిహెచ్. మల్లేశం, తదితరులు పాల్గొన్నారు.

## బయోమైనింగ్‌తో చెత్త సమస్యకు పరిష్కారం

-సంగారెడ్డి మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి



బయోమైనింగ్ ప్రక్రియను ప్రారంభించిన కమిషనర్

**సంగారెడ్డి మున్సిపాలిటీ, డిసెంబరు 17, ప్రభాతవార్త:**
బయో మైనింగ్ ప్రక్రియతో చెత్త సమస్యకు పరిష్కారం లభించిందని సంగారెడ్డి మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం సంగారెడ్డి మండలం ఫసల్వాదిలో పోగుపడిన చెత్తని ప్రాసెస్ చేసే ప్రక్రియ (బయోమైనింగ్)ను సంగారెడ్డి మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సంగారెడ్డి పురపాలక సంఘం పరిధిలో ప్రతిరోజు సేకరించే చెత్త ఫసల్వాది డంప్‌యార్డ్‌కి తరలించేవారని, చాలారోజుల నుండి చెత్త పోగవ్వడం వల్ల అనేక సమస్యలు వచ్చేవని, అన్నింటికీ పరిష్కారంచూపుతూ, అధికారులు బయోమైనింగ్ ప్రక్రియ రెండురోజులక్రితం ప్రారంభించారని అన్నారు. రోజుకు 16గంటల చొప్పున ప్రతిరోజు 300మెట్రిక్ టన్నుల చెత్తని ప్రాసెస్ చేస్తున్నారని, ప్రాసెసింగ్ ప్రక్రియలో వచ్చే బయోసాయిల్ ఎరువుగా, ఇనర్ట్‌ని గుంతలు పూడ్చడానికి, ఆర్‌డిఎఫ్‌ని సిమెంట్ పరిశ్రమకి తరలిస్తారని కమిషనర్ తెలిపారు. డిప్యూటీ ఈఈ రఘు పర్యవేక్షణలో బయోమైనింగ్ ప్రక్రియ నిరంతరాయంగా కొనసాగించుటకు కావాల్సిన అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందని కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, మునిసిపల్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రఘు, ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ వీరేశం, శానిటేషన్ సూపర్‌వైజర్ ఆంబోజి, ఏజెన్సీ ప్రతినిధులు పాల్గొన్నారు.

## పెద్దశంకరంపేటలో ఘనంగా పెన్షనర్స్ డే

**పెద్దశంకరంపేట, డిసెంబరు 17, ప్రభాతవార్త:**
స్థానిక రిటైర్డు ఉద్యోగుల కార్యాలయంలో పెన్షనర్ల దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పెన్షనర్ల కోసం పోరాటం చేసిన డిఎస్.నకార చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులు అర్పించారు. రిటైర్డు ఉద్యోగుల మండలసంఘం అధ్యక్షుడు సాంబయ్యగారి నర్సింలు మాట్లాడుతూ రిటైర్డు ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి అందరూ కలిసి పోరాటం చేయాలన్నారు. అనంతరం ఇటీవల పట్టణ సర్పంచ్‌గా గెలుపొందిన జంగం రేణుకాశ్రీనివాస్‌తోపాటు ఉపసర్పంచ్ రాజుగౌడ్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రిటైర్డు ఉద్యోగులు మోహన్, పురుషోత్తం, నారాయణ, సుభాష్, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

# అందోలును ఫిఫ్త్ ఫ్యూచర్ సిటీగా అభివృద్ధిచేయాలి

-అన్నిరకాలుగా అందోలు అనువైన ప్రాంతం
-రైల్వేసాధన సమితి అధ్యక్షులు గంగాజోగినాథ్



సమావేశంలో మాట్లాడుతున్న రైల్వేసాధన సమితి అధ్యక్షులు గంగాజోగినాథ్

**జోగిపేట, డిసెంబరు 17, ప్రభాతవార్త:**
అందోలు నియోజకవర్గంలోని మంజీర కారిడార్‌లో ఫిఫ్త్ ఫ్యూచర్ సిటీని ఏర్పాటుచేసేలా రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని రైల్వే సాధన సమితి అధ్యక్షులు, మాజీ జోగిపేట మార్కెట్ కమిటి ఛైర్మన్ గంగాజోగినాథ్ డిమాండ్ చేశారు. జోగిపేటలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మంజీర పరీవాహకంలో అందుకు అనువైన భూములున్నాయని, 161 జాతీయరహదారి మంజీరకారిడార్ మీదుగా ఉందని, అలాగే కొత్తగా నిర్మాణం చేయనున్న రీజినల్ రింగ్‌రోడ్ శివంపేట నుంచే వెళ్తుందని, దీనివల్ల హైద్రాబాదుకు, శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు కేవలం గంటలోపే ఇక్కడి నుంచి వెళ్లేందుకు అనువుగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఈ విషయమై ఇప్పటికే ప్రధానమంత్రి మోడీకి, కేంద్రమంత్రులు పీయూష్‌గోయెల్, అశ్వినీవైష్ణవ్, కిషన్‌రెడ్డి, బండి సంజయ్, పార్లమెంటు సభ్యులు రఘునందన్‌రావులకు వినతిపత్రాలు సమర్పించినట్లు తెలిపారు. ఈ విషయంలో పార్టీలకు అతీతంగా అందరు నాయకులు కలిసి మనప్రాంత అభివృద్ధికి కలిసి రావాలని ఆయన కోరారు. రాష్ట్రమంత్రులు శ్రీధర్ బాబు, దామోదర్ రాజనర్సింహాలను కలిసి, వారికికూడా వినతిపత్రాలు అందచేస్తామని తెలిపారు. హుడా ప్రాంతానికి మనప్రాంతం చాలా సమీపంలో ఉన్నందున ఫ్యూచర్ సిటీ ఏర్పాటుకు అనుకూలంగా ఉంటుందని అన్నారు. ఫ్యూచర్ సిటీ ఏర్పాటుచేస్తే సాఫ్ట్‌వేర్ కంపెనీలు, బ్యాంకులు, వివిధరకాల అంతర్జాతీయ కంపెనీలు ఏర్పాటవుతాయని, తద్వారా ఇక్కడి యువతకు ఉపాధి లభించటంతోపాటు ఈ ప్రాంతం చాలా అభివృద్ధి చెందుతుందని ఆయన అన్నారు. మాజీ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ ఛైర్మన్ మఠం బిక్షపతి మాట్లాడుతూ అందోలు ప్రాంతంలో ఫ్యూచర్ సిటీ ఏర్పాటుకు తమ మద్దతు ఎల్లపుడు ఉంటుందని, ఇది చాలా మంచి ప్రయత్నం అని అన్నారు. దీనికోసం మిగతావారు కూడా గట్టిగా ప్రయత్నించాల్సిన అవసరముందని అన్నారు. ఈ సమావేశంలో మాజీ ఎంపిపి హెచ్.రామాగౌడ్, బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు ప్రభాకర్‌గౌడ్, మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ మన్‌సాన్‌పల్లి మల్లిఖార్జున్‌గుప్తా, నాయకులు ప్రభాత్‌కుమార్, మానయ్య, ఫైజల్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ ప్రథమ పౌరుని విధులు ఇవే..

**నారాయణఖేడ్, డిసెంబరు 17, ప్రభాతవార్త:**
గ్రామపంచాయతీ ఎన్నికల జాతర నెలకొంది. ఎన్నికలు జరిగే గ్రామాల్లో ఉదయం సాయంత్రమనే తేడాలేకుండా పోటీలో ఉన్న అభ్యర్థులు వారి అనుచరులు వీధిలో ఇంటింటికీ తిరుగుతూ ఓట్లు అభ్యర్థించారు. పంచాయతీ రాజ్ చట్టం సర్పంచ్‌లు తమ అధికారాలతోపాటు వారు నిర్వహించాల్సిన బాధ్యతలను స్పష్టంచేసింది. విధినిర్వహణలో సర్పంచ్‌లకు విశిష్ట అధికారాలను కట్టబెట్టింది. ఆ కారణంగా కోర్టులో కేసులు వేసేందుకు వీలులేకుండా వారికి రక్షణసైతం కల్పించింది. గ్రామపంచాయతీలలో గెలిచిన సర్పంచ్‌లకు అధికారాలతోపాటు, బాధ్యతలు కూడా అప్పజెప్పింది. గ్రామంలో సర్పంచ్‌ల విధులనుసైతం పంచాయతీ అమలుచేసింది. సామూహిక మరుగుదొడ్ల ఏర్పాటు, బావులమరమ్మతులు, పూడికతీత, జననమరణాల నమోదు, వ్యాధుల నివారణకు ప్రత్యేకచర్యలు, శ్మశానవాటిక నిర్వహణ, దహన సంస్కారాలు, పశువులదొడ్ల ఏర్పాటు, ధర్మశాలలు, అతిథిగృహాల నిర్మాణం, వాటినిర్వహణ, గ్రామంలో రహదారులు, వీధుల్లో మొక్కలపెంపకం, విద్య, ఆరోగ్యం, విద్యాభివృద్ధి, వ్యాయామశాల, పిల్లలకు ఆటస్థలాల ఏర్పాటు, వాటినిర్వహణ, పంచాయతీభవన నిర్మాణం, మరమ్మతులు, పంచాయతీ రోడ్లు, కల్వర్టునిర్మాణం, వీధిదీపాల ఏర్పాటు, వాటినిర్వహణ, మురుగు కాల్వల నిర్మాణం, మరమ్మతులు, గ్రామస్థాయి గ్రంథాలయాల ఏర్పాటు, వ్యవసాయవిధానాల మెరుగుపై ప్రచార కార్యక్రమాల నిర్వహణ, సహకార వ్యవసాయాన్ని ప్రోత్సహించడం, జాతర నిర్వహణ, ప్రకృతి వైపరీత్యాలు, వారికి సాయంచేయడం, కుల, మత, వివక్షలేకుండా జీవనం గడిపేలా గ్రామస్థులను ప్రోత్సహించడం సర్పంచ్ ప్రత్యేకవిధులని పంచాయతీరాజ్ చట్టం తెలిపింది. ఏది ఏమైనప్పటికీ, గ్రామాల్లో ఎన్నికల జాతర ముగిసి, అభ్యర్థులు గ్రామ సర్వతోముఖాభివృద్ధికి తోడ్పతారని ఆయా గ్రామస్థులు ఎదురు చూస్తూ ఉన్నారు.

## టోల్‌ప్లాజా వద్ద భారీగా ట్రాఫిక్ జామ్



టోల్ ప్లాజా 161 వద్ద వాహనాలు జామ్ అయిన దృశ్యం

**చౌటకూరు, డిసెంబరు 17, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని తాడ్దాన్‌పల్లి శివారులో 161వ జాతీయ రహదారిపై భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. నారాయణఖేడ్ డివిజన్‌లో మూడవ విడత పంచాయతీ ఎన్నికలు బుధవారం జరుగుతుండటంతో హైద్రాబాద్ నగరానికి జీవనోపాధికి వెళ్లిన ప్రజలు తమ కుటుంబసభ్యులతో వాహనాల్లో స్వగ్రామాలకు చేరుకుంటుండటంతో జాతీయ రహదారిపై టోల్‌ప్లాజా వద్ద వాహనాలు గంటల తరబడి వేచిచూడాల్సిరావడంతో ట్రాఫిక్ జామ్ అయింది. మధ్యాహ్నం 12గంటల వరకు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడటంతో ఓటింగ్ కోసం వెళుతున్న ఓటర్లు భయాందోళనకు గురయినట్లు తెలుస్తోంది.

## రాజారామ్ తండాలో కాంగ్రెస్ సర్పంచ్ ఎన్నిక

**కంగ్టి, డిసెంబరు 17, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని రాజారామ్ తండాలో బుధవారం జరిగిన పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్‌మద్దతుతో సర్పంచ్‌గా మనిరామ్‌నాయక్ భారీమెజార్టీతో విజయం సాధించారు. పంచాయతీలో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ మద్దతుతో ఎన్నికల బరిలో నిలిచిన మనిరామ్‌నాయక్ ప్రత్యర్థిపై 122 ఓట్ల తేడాతో విజయం సాధించారు. సర్పంచ్‌గా ఎన్నుకున్న పంచాయతీ ప్రజలకు కృతజ్ఞతలు తెలుపుతూ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి, ఎంపి సురేష్ కుమార్ శెట్కార్‌ల సహకారంతో రాజారామ్‌తండాను అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తామని మనిరామ్‌నాయక్ అన్నారు.

## జెమ్లాతాండా సర్పంచ్‌గా విస్లావత్ పార్వతీబాయి

**సిర్గాపూర్, డిసెంబరు 17, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని జెమ్లాతాండ పంచాయతీ సర్పంచ్‌గా విస్లావత్ పార్వతి విజయం సాధించారు. బుధవారం జరిగిన పంచాయతీ ఎన్నికల్లో విస్లావత్ పార్వతీబాయి 111 ఓట్ల మెజార్టీతో సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. గ్రామస్థులు తనపై నమ్మకంతో సర్పంచ్‌గా ఎన్నుకున్నందుకు కృతజ్ఞతలు తెలుపుతూ గ్రామాభివృద్ధికి కృషిచేస్తామని పార్వతీబాయి పేర్కొన్నారు.

## పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కృషి

-ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

**రామచంద్రాపురం, డిసెంబరు 17, ప్రభాతవార్త:**
పటాన్‌చెరు నియోజకవర్గంలోని ప్రభుత్వ పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉన్నామని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. జాతీయ పెన్షనర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం రామచంద్రాపురం డివిజన్‌పరిధిలోని తెలంగాణరాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగులసంఘం రామచంద్రాపురం శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సమావేశానికి ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. తమ సర్వీసు కాలంలో ప్రభుత్వ ఉద్యోగులుగా ప్రజలకు మెరుగైనసేవలు అందించారన్నారు. పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకుపోయి పరిష్కారానికి కృషిచేస్తామన్నారు. కార్యక్రమంలో రామచంద్రాపురం కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పనగేష్, పెన్షనర్ల సంక్షేమ సంఘం అధ్యక్షులు రామ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి రాములు తదితరులు పాల్గొన్నారు.

## వచ్చేది బిఆర్ఎస్ ప్రభుత్వమే

-సర్పంచ్, వార్డు సభ్యుల సన్మానసభలో ఎమ్మెల్యే



సర్పంచ్, వార్డుసభ్యులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

**జహీరాబాద్, డిసెంబరు 17, ప్రభాతవార్త:**
రానున్న శాసనసభ ఎన్నికల్లో (రెండేళ్ల తర్వాత) బిఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడటం తథ్యమని ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు అన్నారు. మంగళవారం సాయంత్రం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో రెండవ విడత పంచాయతీ ఎన్నికల్లో పోటీచేసి సర్పంచ్‌లుగా, వార్డు సభ్యులుగా (బిఆర్ఎస్ మద్దతుతో) ఎన్నికైన సర్పంచ్, వార్డుసభ్యులను, ఉపసర్పంచ్‌లను ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు పూలమాలలు, శాలువాలతో ఘనంగాసత్కరించి అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ఎన్నికైన సర్పంచ్‌లు గ్రామాభివృద్ధే లక్ష్యంగా పాలన సాగించాలన్నారు. గ్రామాల అభివృద్ధికి తన సంపూర్ణమద్దతు ఉంటుందన్నారు. కార్యక్రమంలో మాజీ ఆత్మకమిటీ ఛైర్మన్ విజయ్‌కుమార్, జహీరాబాద్, మొగుడంపల్లి మండలాల బిఆర్ఎస్ అధ్యక్షులు తట్టు నారాయణ, సంజీవరెడ్డి, మాజీ పట్టణ అధ్యక్షులు మోహియుద్దీన్, నాయకులు మిథున్ రాజ్, మాజీసర్పంచ్‌లు, మాజీ ఎంపిటిసి సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

## క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ కో-ఆర్డినేటర్‌గా గడ్డం సుజీవన్



కో-ఆర్డినేటర్ గడ్డం సుజీవన్‌కు ధృవీకరణపత్రం అందచేస్తున్న దృశ్యం

**రామచంద్రాపురం, డిసెంబరు 17, ప్రభాతవార్త:**
పటాన్‌చెరు నియోజకవర్గ క్రిస్టియన్ మైనార్టీస్ ఫైనాన్స్ కార్పోరేషన్ కో-ఆర్డినేటర్‌గా గడ్డం సజీవన్ డిన్నును నియమిస్తూ రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీస్ ఫైనాన్స్ కార్పోరేషన్ ఛైర్మన్ దీపక్ జాన్ నియామక పత్రం అందచేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా గడ్డం సుజీవన్ మాట్లాడుతూ నియోజకవర్గంలోని క్రిస్టియన్ మైనార్టీల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తామన్నారు. తనకు పదవి రావడానికి సహకరించిన ప్రతి ఒక్కరికి గడ్డం సుజీవన్ కృతజ్ఞతలు జరిగాయి.

# పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాలి

-జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు
-కన్‌సాన్‌పల్లి పాఠశాల ఆకస్మిక తనిఖీ



పదో తరగతి విద్యార్థులతో మాట్లాడుతున్న డిఇఓ వెంకటేశ్వర్లు

**జోగిపేట, డిసెంబర్ 17, ప్రభాతవార్త:**
పదో తరగతి విద్యార్థులకు సంబంధించిన ఎగ్జామ్స్ షెడ్యూల్ విడుదల అయినందున ఇక నుంచి విద్యార్థులు అందుకు అనుగుణంగా చదువుకోవాలని జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం మండల పరిధిలోని కన్‌సాన్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీచేశారు. ఈసందర్భంగా ఆయన పాఠశాలలో పదో తరగతి విద్యార్థుల గురించి వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థుల చదువు ఎలా సాగుతుంది, ఏ అకాడమీ బుక్స్ ఫాలో అవుతున్నారని, ప్రత్యేక తరగతుల నిర్వహణ తదితర అంశాలను ఆయన తెలుసుకున్నారు. ప్రతి ఒక్కరు ఇప్పటినుంచే శ్రద్ధగా చదువుకోవాలని, పదో తరగతిలో అందరూ కూడా ఉత్తమ ఫలితాలను సాధించాలని విద్యార్థులకు సూచించారు.

కాగా పాఠశాలలో కేవలం అమ్మాయిలకు మాత్రమే మూత్రశాలలు సరిపోను ఉన్నాయని, బాలురకు మూత్రశాలలు సరిగాలేక ఇబ్బందులు పడుతున్నట్లు ఆయన దృష్టికి తీసుకురాగా, అందుకోసం ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపుతామని పేర్కొన్నారు. ప్రాథమిక పాఠశాలను పరిశీలించి విద్యార్థుతో ముచ్చటించారు. కాగా, ఎఫ్ఎల్ఎన్ ప్రోగ్రాంలో మూడోతరగతి విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. అయితే విద్యార్థుల్లో ఇంకా సామర్థ్యం పెంచాలని సూచించారు. బోధించిన పాఠాలకు, వర్క్‌షీట్లు సరిగా లేవని, టీచర్స్ డైరీ కూడా రాయటంలేదని, ఇవన్నీకూడా సరిచేసుకోవాలని ఆయన సూచించారు.

## తుర్కపల్లిలో ఓట్ చోరీ...

-నా ఓటు ఎక్కడ అని ఆవేదన వ్యక్తం చేసిన యాస్మిన్



మాట్లాడుతున్న బాధితురాలు యాస్మిన్

**నారాయణఖేడ్, డిసెంబరు, 17, ప్రభాతవార్త:**
నారాయణఖేడ్ మండలం తుర్కపల్లి గ్రామంలో ఓటు చోరీ ఘటన కలకలం రేపింది. ఓటు వేయడానికి వచ్చిన ఓ మహిళకు అప్పటికే తన ఓటు నమోదు అయిందని అధికారులు చెప్పడంతో తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లో ఉంటున్న యాస్మిన్ ఓటుహక్కును వినియోగించుకునేందుకు తుర్కపల్లి గ్రామంలోని పోలింగ్‌బూత్‌కు వచ్చారు. అయితే ఆమె పోలింగ్‌బూత్‌లోకి వెళ్లగానే మీ ఓటు ఇప్పటికే నమోదు అయింది అని ఎన్నికల అధికారులు తెలియజేశారు. దీనితో షాక్‌కుగురైన యాస్మిన్, తన ఓటు ఎవరువేశారని ప్రశ్నిస్తూ పోలింగ్ బూత్‌లోనే ఆందోళనకు దిగారు. గ్రామంలో తన ఓటు చోరీజరిగిందంటూ ఆమె ఆగ్రహం వ్యక్తంచేశారు. ఓటువేయకుండా బయటకువచ్చిన ఆమె, పోలింగ్ బూత్‌ముందు నిరసనచేపట్టి న్యాయంచేయాలని డిమాండ్‌చేశారు. ఈ ఘటనతో తుర్కపల్లి గ్రామంలో ఉద్రిక్తవాతావరణం నెలకొంది.

## ఘనంగా విశ్రాంతి ఉద్యోగుల దినోత్సవం



విశ్రాంత ఉద్యోగిని సన్మానిస్తున్న దృశ్యం

**సదాశివపేట, డిసెంబరు 17, ప్రభాతవార్త:**
విశ్రాంతి ఉద్యోగుల సంఘం అభివృద్ధికి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ సహకారంతో కృషి చేస్తామని ఎమ్మెల్యే తనయుడు చింత సాయినాథ్ అన్నారు. బుధవారం విశ్రాంతి ఉద్యోగుల నూతన క్యాలెండర్ ఆవిష్కరణ, పెన్షనర్ల దినోత్సవ వేడుకలను స్థానిక బసవేశ్వర మందిరంలో భారతీయ స్టేట్ బ్యాంక్ మేనేజర్ రాథోడ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమానికి చింత సాయినాథ్ ఎస్‌టిఓ సంపత్, బిఆర్ఎస్ పట్టణపార్టీ అధ్యక్షులు చీల మల్లన్నలు పాల్గొని సీనియర్ పెన్షనర్లను శాలువా పూలదండలతో సన్మానించి విశ్రాంతి ఉద్యోగుల దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో రిటైర్డ్ పోలీస్ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎల్లయ్య, సంఘం ముఖ్యసలహాదారులు బోడపల్లి శంకరప్ప, నిర్వాహక కార్యదర్శి సిహెచ్ మల్లేశం, సహాయ కార్యదర్శి భీమ్రావు తదితర సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## ఘనంగా ముందస్తు క్రిస్మస్ వేడుకలు...



పెద్దశంకరంపేట సిఎస్ఐ చర్చిలో సెమీ క్రిస్మస్ వేడుకలు

**పెద్దశంకరంపేట, డిసెంబరు 17, ప్రభాతవార్త:**
మండల కేంద్రంలోని సిఎస్ఐ చర్చిలో ముందస్తు సెమీ క్రిస్మస్ వేడుకలను. ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల ఫాస్టర్ దేవవరం ఏసుక్రీస్తు జననం, పునరుత్థాన వేడుకలు, ఆయన చూపిన సన్మార్గంపై వివరించి భోధనలు నిర్వహించారు. సభ్యులు నిర్వహించిన క్రిస్మస్ నాటిక అందరిని ఆకట్టుకుంది. ఆయా గ్రామాల నుండి వచ్చిన భక్తులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో సభ్యులు శైలజావాకర్, పద్మారావు. అనంతరావు, భూషణం, పౌల్, భూమయ్య, సుమంగళ తదితరులున్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వంతోనే గ్రామాల అభివృద్ధి

నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి...

**పెద్దశంకరంపేట, డిసెంబరు 17, ప్రభాతవార్త:**
కాంగ్రెస్ ప్రభుత్వంతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమవుతుందని నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి అన్నారు. బుధవారం పట్టణ కాంగ్రెస్ నాయకులు మురళిపంతులు నివాసంలో పట్టణంలో కాంగ్రెస్‌పార్టీ తరపున గెలిచిన ఉపసర్పంచ్ రాజుతోపాటు 12మంది వార్డుసభ్యులను పూలమాలలు శాలువాలతో సన్మానించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే సంజీవరెడ్డి మాట్లాడుతూ మండలపరిధిలోని గ్రామాల అభివృద్ధికి నిరంతరం కృషిచేస్తామని అన్నారు. పట్టణ అభివృద్ధికి అందరూ కలిసి కృషిచేయాలని పేర్కొన్నారు. పార్టీలకు అతీతంగా అర్హులైన వారందరికీ ప్రభుత్వ సంక్షేమపథకాలు అందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు నారా గౌడ్, మురళీ పంతులు, ఆయా గ్రామాల కాంగ్రెస్‌పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల అభివృద్ధికి సహకరిస్తా

-ఎమ్మెల్యే చింత ప్రభాకర్



ఎమ్మెల్యేను కలిసిన నూతన సర్పంచ్‌లు

**సంగారెడ్డి మున్సిపాలిటీ, డిసెంబరు 17, ప్రభాతవార్త:**
గ్రామ అభివృద్ధి లక్ష్యంగా ముందుకు సాగాలని తన పూర్తి మద్దతు, సహకారం ఉంటుందని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ పేర్కొన్నారు. ఇటీవల జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో విజయం సాధించిన ఇరిగిపల్లి గ్రామ సర్పంచ్ సుప్రియసతీష్, గుంతపల్లి సర్పంచ్ అనంతరెడ్డిలు బుధవారం ఎమ్మెల్యే చింతా ప్రభాకర్‌ను మర్యాదపూర్వకంగా సంగారెడ్డి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కలిశారు. ఎమ్మెల్యే వారిని శాలువాతో సన్మానించి, పుష్పగుచ్ఛంతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. గ్రామాల అభివృద్ధికి పూర్తిసహకారం అందిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో మాజీ సిడిసి విజేందర్‌రెడ్డి, ఆర్.వెంకటేశ్వర్లు, పి.నర్సింలు, మాజీ జడ్పిటిసి కొండల్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు చక్రపాణి, సందీప్, జలంధర్, పంచాయతీ సభ్యులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.